





సర్కారుపై యుద్ధం చేద్దామని రాజమండ్రి నగర జేఏసీ నాయకుల అభివాదం

నేటి నుంచి ప్రభుత్వ ఉద్యోగుల ఆందోళన బాట

- ప్రభుత్వంపై యుద్ధానికి సిద్ధంకండి
- ఏపీ జేఏసీ ఉద్యమ బాట.. నల్లబ్యాడ్జీలతో నిరసన
- కలెక్టర్, సబ్-కలెక్టర్, తహశీల్దార్లకు వినతులు
- 27న ఛలో విజయవాడ..
- రాజమహేంద్రవరం జేఏసీ నేతల పిలుపు


రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ ప్రభుత్వం ఉద్యోగులను మోసం చేసిందని..దీంతో ఆందోళనకు సమాయత్తమవ్వాలని రాజమహేంద్రవరం సిటీ జేఏసీ నేతలు పిలుపునిచ్చారు. స్థానిక ఏపీ ఎన్‌జీవో హోంలో మంగళవారం ఏపీ జేఏసీ నగర శాఖ విస్తృత సమావేశంలో పలువురు మాట్లాడారు. గత నాలుగున్నరేళ్లుగా ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లను మోసం చేసిన ప్రభుత్వానికి ఉద్యోగులతో పెట్టుకుంటే ఎలా ఉంటుందో చూపించాలన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు రాష్ట్ర ప్రభుత్వం సుమారు రూ.20 వేల కోట్లకు పైగా బకాయి ఉందన్నారు.చివరకు ఉద్యోగులు దాచుకున్న జీపీఎఫ్ ఏపీజీఎల్ఐ వంటి క్లెయిమ్‌లు కూడా ప్రభుత్వం చెల్లించడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. పదవీ విరమణ చెందిన వారి ప్రయోజనాలు చెల్లింపులో జాప్యం చేస్తుందన్నారు. ప్రతి నెల ఒకటో తేదీన పింఛన్లు, జీతాలు ఇవ్వడం లేదన్నారు. ఉద్యోగుల డిమాండ్లను పరిష్కరించని ఏ ప్రభుత్వము కూడా తిరిగి అధికారంలోకి రాలేదని హెచ్చరించారు. ఏపీ జేఏసీ పిలుపు మేరకు బుధవారం ఉద్యోగ, ఉపాధ్యాయులందరూ నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరవ్వాలని జేఏసీ అధ్యక్షుడు సుబ్బారావునాయుడు పిలుపు ఇచ్చారు. రాజమహేంద్రవరం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి వద్ద ఉదయం నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపి,ఆర్డీవోకు వినతిపత్రం అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నగర ఎన్‌జీవో సంఘం కార్యదర్శి ప్రవీణ్‌కుమార్, ఏపీ జేఏసీ కార్యదర్శి వేణుమాధవరావు, జిల్లా యూటీఎఫ్ అధ్యక్షుడు జయకర్, కార్యదర్శి షరీఫ్, ఎస్టీయు నాయకులు డేనియల్,పింఛన్‌దార్ల సంఘం నాయకులు కేజీకే మూర్తి, నాలుగోతరగతి ఉద్యోగుల సంఘం అధ్యక్ష కార్యదర్శులు వెంకటేశ్వరరావు, రమణ, నగర ఎన్జీవో సంఘ నాయకులు అనిల్‌కుమార్, ప్రతాప్, మాధవరావు, రాఘవరావు తదితరులు పాల్గొన్నారు.

4 రోజుల పాటు నిరసన

ఉద్యోగ,ఉపాధ్యాయ, కార్మిక, పెన్షన్‌దార్ల ఐక్య కార్యాచరణ (ఏపీ జేఏసీ) ఆధ్వర్యంలో తమ సమస్యల పరిష్కారానికి ఉద్యమ శంఖారావం పేరిట ఉద్యమబాట పట్టారు. ప్రభుత్వం చర్చలకు పిలిచి సరిగ్గా స్పందించకపోవడంతో ఉద్య మకార్యాచరణ వైపే జేఏసీ మొగ్గిన సంగతి తెలిసిందే.ఈ నేపథ్యంలో బుధవారం నుంచి వరుసగా నిరసన కార్య క్రమాలకు పిలుపునిచ్చారు. ఉద్యోగులందరూ బుధవారం నల్ల బ్యాడ్జీలు ధరించి తహశీల్దార్లు,సబ్- కలెక్టర్, కలెక్టర్‌కు మెమోరాండం సమర్పిస్తారు. 15న భోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జీలతో నిరసన తెలియజేస్తారు. 16న సభలు నిర్వహిస్తారు.17న ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ జిల్లా కేంద్రాల వద్ద, తాలూకా ఆఫీసుల వద్ద ర్యాలీలు, ధర్నాలు నిర్వహిస్తారు. 20న కలెక్టరేట్ వద్ద ర్యాలీ , ధర్నా నిర్వహిస్తారు. 27న ఛలో విజయవాడకు పిలుపునిచ్చారు.

తెలి మంచు కురిసింది..

తెలిమంచు కురిసింది తలుపు తీయనా ప్రభూ.. ఇలగొంతు వొణికింది తలుపు తీయనా ప్రభూ.. ఈ పాటలాగే ప్రస్తుతం గ్రామాల్లో పరిస్థితి కనిపిస్తోంది.. నాలుగు రోజులుగా గ్రామాల్లో ఎడతెరిపి లేని మంచు కురుస్తోంది.. రాత్రి 11 గంటలకే మంచుదుప్పటి కప్పేస్తోంది.. ఉదయం 8 గంటలు దాటినా మంచు వీడడంలేదు.. తెల్లవారుజామున పొగమంచు దట్టంగా అలుముకుని ఉండడంతో వాహనాలు దగ్గరకు వచ్చే వరకు కూడా కనిపించని పరిస్థితి నెలకొంటుంది. ఉదయం 7.30 గంటలు దాటిన తరువాత భానుడు మెల్లమెల్లగా బయటకు వస్తున్నాడు.. 9 గంటలకు బయటపడు తున్నాడు..ఆ తరువాత నుంచి మండిపడుతున్నాడు.. ఈ సుందర దృశ్యాలు మంగళ వారం పెరవలి, తీపర్రు గోదావరి తీరాన కెమెరాకు చిక్కాయి.. - పెరవలి





ఓపీకి క్యూకట్టిన రోగులు.. సెల్‌ఫోన్లతో కుస్తీపడుతున్న నర్సులు

ఓపీ..వెతలు!

జిల్లా ఆసుపత్రిలో చీటీకి చింతే..

పేద రోగులతో ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది ఆటలాడుతున్నారు..స్మార్ట్ ఫోన్ ఉంటేనే వైద్యం లేదంటే నో చెబుతున్నారు.. దీంతో రోగులకు ఇక్కట్లు తప్పడం లేదు.. గతంలో ఎవరైనా రోగి ప్రభుత్వ ఆసుపత్రికి వస్తే ఓపీ రాసిచ్చేశారు.. వైద్యుడికి చూపించుకుని మందులు తీసుకునే వారు..ప్రస్తుతం చీటీ మాటేలేదు.. అంతా ఆన్ లైన్.. అదే రోగులకు ఇబ్బందిగా మారింది.. పాత పద్ధతినే కొనసాగించాలని ఆసుపత్రికి వచ్చే పేద రోగులు డిమాండ్ చేస్తున్నారు..

- పేదలకు వైద్యం అందని ద్రాక్షే
- ఓపీకే గంటల తరబడి నిరీక్షణ
- స్మార్ట్ ఫోన్ ఉంటేనే ఓపీ చీటీ
- ఇక్కట్లకు గురవుతున్న పేదలు
- స్మార్ట్ ఫోన్ తెలియక గగ్గోలు
- జీజీహెచ్‌కు తగ్గిన రోగులు

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 13 : రాజమహేంద్రవరం జీజీహెచ్ (ప్రభుత్వాసుపత్రి)లో రోగులకు అందే వైద్య సేవల మాటెలా ఉన్నా ఓపీ కష్టాలు మాత్రం తీరడంలేదు. ఓపీ (అవుట్‌పేషెంట్) విభాగంలో చీటీలు రాయించుకోవడానికి రోగులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం తొమ్మిదింటికే ఆసుపత్రికి వస్తున్నా ఓపీ చీటీ కోసం గంటల తరబడి వేచి చూడాల్సి వస్తోంది. ఏబీహెచ్ఏ యాప్ ద్వారా రోగుల వివరాలను మొబైల్ ఫోన్‌లో నమోదు చేయాల్సి రావడం, ఈ ప్రక్రియ పూర్తి చేయడానికి విపరీతమైన జాప్యం కారణంగా ఈ పరిస్థితి ఏర్పడుతోంది. సమయం అంతా ఓపీ చీటీలు రాయించుకోవడానికే సరిపోవడంతో డాక్టర్ దగ్గరకు వెళ్లేసరికి మరింత నీరసించిపోతున్నారు.ఈ కారణంగా ఓపీ చాలా వరకూ తగ్గుతున్నట్టు చెబుతున్నారు. సోమవారం ఓపీ కాస్త బాగుంటున్నా మిగిలిన రోజుల్లో బాగా తగ్గినట్టు తెలుస్తోంది. గతంలో సగటున వెయ్యి మందికి పైగా ఉన్న ఓపీ సంఖ్య ఇప్పుడు ఐదు, ఆరు వందలకు పడిపోయినట్టు చెబుతున్నారు. సదరం క్యాంపులు జరిగే మంగళ, శుక్రవారాల్లో ఓపీ సంఖ్య ఎక్కువగా కనిపిస్తున్నా వీళ్లలో చాలా మంది సదరం శిబిరాలకు వచ్చినవారే ఉన్నట్టు సమాచారం.



ఓపీ చీటీ కావాలంటే..

ఓపీ చీటీ కావాలంటే రోగి లేదా వారి సహాయకుల వద్ద తప్పనిసరిగా మొబైల్ ఫోన్ ఉండాలి. మొబైల్ ఫోన్‌కు వచ్చే ఓటీపీ నెంబరు చెబితేనే ఓపీ చీటీని జనరేట్ చేస్తారు. ముందుగా ఏబీహెచ్ఏ యాప్‌లో రోగికి సంబంధించిన ఆధార్ కార్డు నెంబరు, ఫోన్ నెంబరు, ఇంటి అడ్రస్ వంటి వివరాలన్నీ నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. ఆ తర్వాత యాప్‌లో లాగిన్ అయి, క్యూ ఆర్ కోడ్ ప్రక్రియ ద్వారా టోకెన్ నెంబరు పొందాల్సి ఉంటుంది. ఈ టోకెన్ నెంబరు చెబితేనే ఏబీహెచ్ఏ కౌంటర్ (ఓపీ కౌంటర్)లో కంప్యూటర్ ఓపీ చీటీ ఇస్తారు. ఇలా ఈ తతంగమంతా పూర్తి కావడానికి ఒక్కొక్కరికీ కనీసం 15 నుంచి 20 నిమిషాల సమయం పడుతుంది. అప్పటి వరకూ రోగి వేచి ఉండాల్సిందే. అయితే జీజీహెచ్ అధికారులు ఓపీ విభాగం వద్ద కొంత మంది సహాయకులను ఏర్పాటు చేసినా రోగులకు ఇక్కట్లు తప్పడంలేదు. స్మార్టుఫోన్‌లో ఏబీహెచ్ఏ యాప్ ద్వారా ఎవరికి వారే సొంతంగా టోకెన్ నెంబరు పొందవచ్చని ప్రభుత్వం చెబుతున్నా చాలామందికి దీనిపై అవగాహన లేకపోవడంతో ఆచరణలో ఇది సాధ్యం కావడంలేదు.

మొబైల్ ఫోన్ ఉండాల్సిందే..

స్మార్టు ఫోన్ లేని సాధారణ మొబైల్ ఫోన్ ఉన్న బాధితులు నేరుగా ఏబీహెచ్ఏ కౌంటర్‌లో సంప్రదించాలని అధికారులు చెబుతున్నా ఓపీ విభాగం సిబ్బంది రోగుల పట్ల నిర్లక్ష్యం చూపుతున్నారనే విమర్శలున్నాయి. సాధారణ మొబైల్ ఉన్నవారు ఏబీహెచ్ఏ కౌంటర్‌లో సంప్రదించాలని, ఎటువంటి ఫోన్ లేని వారు సాధారణ కౌంటర్‌లో టోకెన్ పొందాలని ఇస్తున్న ప్రకటనలు ఏ మాత్రం ఆచరణకు నోచుకోవడంలేదు. దీంతో ఓపీ రోగులకు ఇబ్బందులు తప్పడంలేదు. జీజీహెచ్ అధికారులు ఈ సమస్యపై దృష్టిసారించాలని ప్రజలు కోరుతున్నారు.

ఏఎస్పీ అనిల్‌కుమార్ బాధ్యతల స్వీకరణ



రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా శాంతి భద్రతల విభాగం అడిషనల్ ఎస్పీగా పి.అనిల్‌కుమార్ మంగళవారం బాధ్యతలు స్వీ కరించారు. అనంతరం ఎస్పీ జగదీశ్‌ని మర్యాదపూర్వకం గా కలిసి మూడు సింహాల ప్రతిమను అందజేశారు. ఎస్పీ ఆయనకు పలు సూచనలు చేశారు.రానున్న ఎన్నికల నేప థ్యంలో శాంతి భద్రతల సమస్యలు తలెత్తకుండా ఇప్పటి నుంచే పటిష్ఠ మైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ప్రణాళికాబద్ధంగా పూర్తి సమన్వ యంతో ముందుకు వెళ్లాలని సూచించారు.ప్రజా భద్రత, రక్షణకు తొలి ప్రా ధాన్యం ఇవ్వాలన్నారు.2012 గ్రూప్-1 అధికారి అయిన అనిల్.. అనంతపురం,చింతపల్లి, విజయన గరంలో డీఎస్పీగా, డీజీపీ కార్యాలయంలో ఓఎస్డీగా పనిచేశారు. అడిషనల్ ఎస్పీగా ఉద్యోగోన్నతిపై గుంటూరు జిల్లాకు వెళ్లారు.తర్వాత అల్లూరి సీతారామరాజు జిల్లాలో అడిషనల్ ఎస్పీ(పరిపాలన)గా విధులు నిర్వర్తిస్తూ ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా జిల్లాకు వచ్చారు. ఆయనకు సమర్థవంతమైన అధికారిగా పేరుంది. అనిల్‌కి జిల్లాలోని డీఎస్పీలు, సీఐలు తదితరులు అభినందనలు తెలిపారు.



నల్లజర్ల మండలం ఆవపాడులో నిలిచిన డ్రైనేజీ నిర్మాణ పనులు

తవ్వారు..వదిలేశారు!

- గడప గడపకు పనుల్లోనూ వైసీపీ వర్గపోరు
- నిధులున్నా..ముందుకు సాగని డ్రైనేజీ నిర్మాణం
- లబోదిబోమంటున్న ఆవపాడు గ్రామస్తులు

నల్లజర్ల ,ఫిబ్రవరి 13 : ఎక్కడైనా నిధుల్లేక పనులు ఆగిపోతాయి. ఆ గ్రామంలో మాత్రం వైసీపీలోని రెండు వర్గాల మధ్య పోరు కారణంగా పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అయినా పట్టించుకునే వారే లేరు. గడప గడపకు కార్యక్రమంలో భాగంగా విడుదలైన రూ.20 లక్షల నిధులతో నల్లజర్ల మండలం ఆవపాడులో డ్రైనేజీ పనులు ప్రారంభించారు. వైసీపీ నాయకుడు ఆది తాతాజీ డ్రైనేజీ పనులు చేసేందుకు గోతులు తవ్వించారు.మరో వర్గం పనులు నిలిపివేయాలని అధికారులపై ఒత్తిడి తీసుకురావడంతో ఎక్కడి పనులు అక్కడే ఆగిపోయాయి. గత 15 రోజుల నుంచి ఇటు గుంతలు పూడ్చక.. మరో పక్క డ్రైనేజీ పనులు చేయకపోవడంతో గ్రామస్తులు గగ్గోలు పడుతున్నారు. తమ ఇళ్ల నుంచి బయటకు రావడం కష్టతరంగా ఉందని 15 కుటుంబాల వారు వాపోతున్నారు.బోదెలపై కర్రలు వేసుకుని వస్తున్నారు. రాత్రి సమయంలో అయితే బోదెలో పడిపోయే ప్రమాదం ఉందని గ్రామస్తులు చెబుతున్నారు.పనులు చేయకపోతే రూ.20 లక్షల నిధులు వెనక్కి వెళ్లిపోతాయని అవేదన చెందుతున్నారు.ఉన్నతాధికారులు ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరుతున్నారు.

నేటి నుంచి తంటికొండ వెంకన్న బ్రహ్మోత్సవాలు

గోకవరం, ఫిబ్రవరి13:గోకవరం మండలం తంటికొండలో శ్రీదేవి భూదేవి సమేత శ్రీవెంకటేశ్వరస్వామివారి 64వ దివ్య బ్రహ్మోత్సవాలు బుధవారం నుంచి 18వ తేదీ వరకు జరగనున్నాయి.ఈ మేరకు భక్తుల సౌకర్యార్థం సకల ఏర్పాట్లు చేసినట్టు దేవస్థానం చైర్మన్ బదిరెడ్డి రాంబాబు(రెడ్డియ్య), కార్యనిర్వహణాధికారి గండి వెంకటలక్ష్మీకుమార్ మంగళవారం తెలిపారు. బ్రహ్మోత్సవాలు ప్రారంభ రోజు బుధవారం ఉదయం ఆలయ ప్రదక్షిణ స్వస్తివాచనం, స్వామివారి పాదసేవ, హారతి, సంకల్పం, విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం,రిత్విక్ వరుణ, దీక్ష ధారణ, తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించనున్నారు.బ్రహ్మోత్సవాలు ఐదు రోజులు జరుగుతాయి. భక్తులు పెద్ద ఎత్తున హాజరై స్వామిని దర్శించుకోవాలని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేశామన్నారు.

రేపు జిల్లాస్థాయి ఇన్‌స్పైర్ ప్రదర్శన

రాజమహేంద్రవరంసిటీ, ఫిబ్రవరి 13: జిల్లాస్థాయి ఇన్‌స్పైర్ మనక్ ప్రదర్శనకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు రాజమహేంద్రవరం డివిజన్ ఉప విద్యాశాఖ అధికారి ఈవీబీఎస్ నారాయణ తెలిపారు. రాజమహేంద్రవరం లలితానగర్ సీజీటీఎం ఇంగ్లీష్ మీడియం స్కూల్ లో గురువారం ప్రదర్శనలు ఉంటాయని తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన పాఠశాలను పరిశీలించి ఏర్పాట్లు చూశారు.బుధవారం మధ్యాహ్నం 2గంటల నుంచి ఎంపికైన ప్రాజెక్టుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఉంటుందన్నారు. ఎంపికైనవారు తమ ప్రదర్శనలను తమకు కేటాయించిన రూమ్‌లో భద్ర పరుచుకుని 15న ఉదయం 8:30 గంటలకు హాజరుకాలన్నారు.

మళ్లీ బ్లేడ్‌బ్యాచ్‌ల.. కలకలం



గోకవరం హోటల్‌లో పడి ఉన్న బ్లేడ్ ముక్క



ఇటీవల గోకవరం పోలీస్ స్టేషన్ పక్కన ఒక హోటల్‌లో బ్లేడ్‌తో జరిగిన దాడి..

- రెచ్చిపోతున్న రౌడీ మూకలు
- రాత్రయితే రోడ్లపై హల్‌చల్
- ఒంటరిగా కనిపిస్తే దోపిడీకి స్కెచ్
- నగరంలో 1300 మంది ఆవారాలు
- పీడీ కేసులో 400 మంది అరెస్టు
- బెయిల్‌పై వచ్చీ అదే పని
- కొరవడిన పర్యవేక్షణ
- చోద్యం చూస్తున్న పోలీసులు
- గోకవరంలో బ్లేడ్‌తో దాడి
- భయంభయంగా నగరవాసులు
- రాత్రయితే ఇళ్లకే పరిమితం

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

ఏరిపారేశాం.. భయం వద్దు.. ఇదీ పోలీసుల మాట. కానీ వాస్తవ పరిస్థితులు ఆ మాటలను సవాల్ చేస్తున్నాయి. ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో మరింత భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. జిల్లాలో మళ్లీ అల్లరి మూకల కదలికలు కనబడుతున్నాయి. చట్టాల గొడుగులో శాంతిగా భద్రంగా ఉన్నామనుకుంటున్న తరుణంలో ఆవారాగాళ్లు రెచ్చిపోతున్నారు. జైలు నుంచి బెయిల్‌పై విడుదవుతున్న బ్లేడ్‌బ్యాచ్‌లపై పర్యవేక్షణ కొరవడిందనేఆరోపణలు సంఘటనలను నిజం చేస్తున్నాయి.

మళ్లీ బ్లేడ్ బ్యాచ్‌ల అలికిడి...

ఓ ఉద్యోగి పది రోజుల క్రితం రాత్రి 12 గంటల సమయంలో జాతీయ రహదారిపై వస్తున్నారు. ఆయనను జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) పక్కన ఉన్న లీలాకృష్ణ టయోటా షోరూం వద్ద బైక్‌పై ఉన్న ఇద్దరు యువకులు లిఫ్ట్ కావాలంటూ వేలితో సింబల్ చూపించారు. ఈ సమయంలో సహాయం అవసరమని ఆయన ఆగారు. ఆ ఇద్దరిలో ఒకరు టార్చ్‌లైట్ వేసి ఆ వ్యక్తిని పరిశీలించాడు. 'వదిలేయ్ రా' అని చెప్పగానే.. 'పోరా' అని ఆ యువకుడు దురుసుగా చెప్పాడు. ప్రాణాలు దక్కాయంటూ ఆ వ్యక్తి వెళ్లిపోయాడు. ఆ వ్యక్తి మెడలో, చేతులకు ఏమైనా బంగారు వస్తువులు ఉన్నాయోమో అని యువకులు గమనించారు. ఏమీ లేకపోవడంతో వదిలేశారు. ఆ వ్యక్తి శరీరంపై ఏమైనా బంగారు వస్తువులు ఉంటే.. పరిస్థితి ఊహించుకోవడానికే భయంగా అనిపిస్తోందా!?. ఇది ఒక ఉదాహరణ మాత్రమే. గోకవరంలోని ఓ రెస్టారెంట్‌లో మరో ఘటన జరిగింది. బ్లేడ్‌బ్యాచ్‌గాళ్ల పని కాదని పోలీసులు మరుసటిరోజు చెప్పేశారు. కానీ బాధితుల ఒంటిపై గాయాలు, ఘటనా ప్రదేశంలో దొరికిన బ్లేడు ముక్కలు పోలీసుల మాటల్లో ఎంత వరకూ నిజం ఉందోననే అనుమానం కలిగిస్తున్నాయి.

సీసీ కెమెరాలు బొజ్జున్నాయా?

పెద్ద పెద్ద ఘటనల విషయంలో కేసులను పరిష్కరించిన చరిత్ర సీసీ కెమెరాలకు ఉంది. అయితే హైవేలో ఉన్న సీసీ కెమెరాలు ఎంత వరకూ పనిచేస్తున్నాయో తెలియని దుస్థితి ఉంది.ఈ క్రమంలో సిటీల్లో కెమెరాలపై పోలీసులు సీరియస్‌గా దృష్టి సారించాల్సిన అవసరం కనిపిస్తోంది. హైవేపై ఎన్‌హెచ్ఏఐతో పాటు పోలీసుల కెమెరాలు ఉన్నాయి. కానీ వాటి ఫుటేజీ విషయంలో అనుమానాలున్నాయి. కరెంటు లేని సమయంలో బ్యాటరీల సహాయంతో కెమెరాలు పనిచేసే ఏర్పాటు ఉండాలి. కానీ కరెంటు పోయిన సమయంలో కెమెరాలు ఎప్పుడు పనిచేస్తాయో తెలియడం లేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదులు వచ్చిన సందర్భంలో దర్యాప్తు తలనొప్పిగా మారుతోంది. హైవే పక్కన టయోటా షోరూం కొన్నాళ్ల కిందట మూసేశారు. రాత్రి సమయంలో ఆ ప్రాంతం భయానకంగా ఉంటుంది. ఇలాంటి వాటిపై పోలీసులు సీరియస్‌గా దృష్టి సారించాల్సిన అవసరత కనిపిస్తోంది.

రాజకీయ ఒత్తిళ్లు

బ్లేడ్‌బ్యాచ్, గంజాయి కేసుల్లో ఇప్పటికే 400 మంది వరకూ జైలులో ఉన్నారు. ఎస్పీ జగదీశ్ వచ్చిన తర్వాత ఉక్కుపాదంతో తొక్కేశారని చెబుతున్నారు. అయితే వాస్తవంలో ఆ పరిస్థితి కానరావడం లేదు. కేవలం రాజమహేంద్రవరంలోనే 1300 మంది వరకూ అలాంటి ఆవారాగాళ్లు ఉన్నట్టు సమాచారం. ధవళేశ్వరంలోనూ వీరికి తాకిడి ఎక్కువగా ఉంది.రాజకీయ ఒత్తిళ్లతో కొందరిపై చర్యలు తీసుకోలేపోతున్నారనే అపవాదు ఉంది. పోలీసులు పీడీ యాక్టు ప్రకారం కేసులు బనాయిస్తున్నా వారిలో బెదురు కానరావడం లేదు. అల్లరి మూకల లీడర్లు బయటే తిరుగుతున్నారని తెలుస్తోంది. వాళ్లపై ఎందుకు కఠిన చర్యలు తీసుకోవడం లేదో సామాన్యులకు అర్థం కావడం లేదు. ఒకవేళ అరెస్టు చేసి కోర్టు ఆదేశాలతో జైలుకు పంపిస్తున్నా బెయిల్ వచ్చే వాళ్లపై పర్యవేక్షణ కొరవడింది.దీంతో వాళ్లు రెచ్చిపోతున్నారు. వైసీపీ ప్రభుత్వంలో గంజాయి విచ్చలవిడిగా దొరుకుతుందనేది బహిరంగ రహస్యమే. మునుపటికంటే గంజాయి రవాణా, లభ్యత పెరిగినట్టు సమాచారం. గ్రామాల్లో కూడా దొరికేస్తోంది. దీంతో యువత పక్కదారి పడుతోంది. మత్తుకు అలవాటుపడి గంజాయి, మద్యం కొను గోలుకు నేరాల బాట పడుతున్నారు. పనీపాటా లేని యువకులు అర్ధరాత్రివేళ డబ్బుల కోసం వక్రమార్గాలు పడుతున్నారు.ఉపాధి లేక కోర్టులో కేసులు నడుస్తున్నా మళ్లీ నేరాలకు బరితెగిస్తున్నారని పెద్దలు చెబుతున్నారు. మళ్లీ బ్లేడ్ బ్యాచ్‌లపై పోలీసులు నిఘా పెట్టాల్సి ఉంది.



వినాయకునికి సప్త నదీ జలాలతో అభిషేకిస్తున్న అర్చకులు

వైభవంగా సప్త నదీ జలాభిషేకం

అయినవిల్లి, ఫిబ్రవరి13: బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అయినవిల్లి శ్రీసిద్ధి వినాయక ఆలయంలో మంగళవారం సప్త నదీ జలాభిషేకం వైభవంగా నిర్వహించారు. గణపతి పూజ, దీక్షా ప్రారంభం, పుణ్యాహవచనం, పంచగవ్యం, గణపతికల్పం, సప్తనదీ జల మండపారాధన, మహన్యాసం, సప్తనదీ జలాలతో స్వామివారికి అభిషేకం, లక్ష దూర్వార్చన, లక్ష్మీగణపతి అష్టద్రవ్య హోమం, నీరాజన మంత్రపుష్పం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి ముదునూరి సత్యనారాయణరాజు, చైర్మన్ గుత్తుల నాగబాబు, ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు.

కోటిపల్లి-నర్సాపురం రైల్వే లైనుకు రూ.50 కోట్లు నిధులు: ఎంపీ అనురాధ


అల్లవరం, ఫిబ్రవరి13: కోటిపల్లి-నర్సాపురం రైల్వేలైన్ నిర్మాణంలో భూసేకరణకు రాష్ట్ర ప్రభుత్వ వాటాగా రూ.50 కోట్లు నిధులు మంజూరు చేసిందని అమలాపురం ఎంపీ చింతా అనురాధ తెలిపారు. ఎటువంటి అపోహలు వద్దని, రైల్వేలైను నిర్మాణానికి వైసీపీ ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందన్నారు. ఈ రైల్వేలైన్‌కు ఇప్పటివరకు రూ.1,409 కోట్లు సాధించామన్నారు. ఈ ఏడు కేంద్ర బడ్జెట్‌లో రూ.300 కోట్లు, రైల్వే ట్రాకుల మరమ్మతులకు రూ.10 కోట్లు, భూసేకరణకు రూ.50 కోట్లు కేటాయించినట్టు ఎంపీ కార్యాలయం తెలిపింది.

నేడు కాంగ్రెస్ ఉభయగోదావరి జిల్లాల సమీక్ష

పార్టీ జిల్లా అధ్యక్షురాలు అరిగెల అరుణకుమారి



పెరవలి, ఫిబ్రవరి13: ఉభయగోదావరి జిల్లాల కాంగ్రెస్ పార్టీ నాయకుల సమీక్షా సమావేశం ఈనెల 14న ఉదయం రాజమహేంద్రవరంలో నిర్వహిస్తున్నట్టు పార్టీ తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షురాలు అరిగెల అరుణకుమారి తెలిపారు. రాజమహేంద్రవరం పేపర్‌మిల్లు గేటు వద్ద ఉన్న సాయి కల్యాణ మండపంలోని జరిగే ఈ సమావేశానికి కాంగ్రెస్ పార్టీ ఏపీ వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్యం ఠాగూర్, కొప్పుల రాజు, ఏఐసీసీ సెక్రటరీ మయ్యప్పన్, సీడబ్ల్యూసీ సభ్యుడు గిడుగు రుద్రరాజు, ఉభయగోదావరి జిల్లాల పార్టీ పర్యవేక్షకురాలు సుంకర పద్మశ్రీ హాజరవుతారన్నారు. జిల్లాలోని నగర, పట్టణ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, యూత్ కాంగ్రెస్ మహిళా విభాగం, అనుబంధ సంస్థల అధ్యక్షులు, సోషల్ మీడియా కోఆర్డినేటర్లు హాజరవ్వాలని కోరారు.



విద్యుదుత్పత్తి నిలిపివేత

మోతుగూడెం, ఫిబ్రవరి13: సీలేరు కాంప్లెక్స్‌లో మూడు జల విద్యుత్ కేంద్రాల్లో విద్యుదుత్పత్తిని నిలిపివేశారు. డొంకరాయి జలాశయం నుంచి గోదావరి డెల్టాకు నీరు విడుదల చేస్తుండడంతో నీటి నిల్వలు తగ్గుతున్నాయి. బలిమెల, జోలాపుట్టు జలాశయాల్లో ఏపీ వాటాగా 19.92 టీఎంసీలు, గుంటవాడ, డొంకరాయి జలాశయాల్లో 12.81 టీఎంసీల నీటి నిల్వలు ఉన్నాయి. గోదావరి డెల్టాకు డొంకరాయి నుంచి 4వేల క్యూసెక్కుల నీటి నిల్వలు వెళ్తున్నాయి. ప్రస్తుతం గోదావరి డెల్టాకు నీటి అవసరం లేదని జలవనరుల శాఖ అధికారులు చెప్పారు. దీనితో జెన్‌కో అధికారులు నీటిని పొదుపుగా ఉపయోగిస్తున్నారు. రాబోయే వేసవిలో విద్యుత్ డిమాండ్‌ను అధిగమించడానికి సీలేరు కాంప్లెక్స్‌లో ఉత్పత్తిని నిలుపుదల చేసి, జలాశయాల్లో నీటిని పొదుపు చేస్తున్నారు.

ఒకే ప్రశ్నపత్రం.. ఒకేరోజు డీఎస్సీ నిర్వహించాలి

- ఆన్‌లైన్ పరీక్షా విధానంతో అభ్యర్థులకు తీవ్ర నష్టం
- ఉపాధ్యాయ చరిత్రలో మినీ డీఎస్సీ ఇదే : ఎమ్మెల్సీ ఐవీ



అమలాపురం రూరల్, ఫిబ్రవరి 13: ఆన్‌లైన్ పరీక్షా విధానం డీఎస్సీ ఉద్యోగార్థులకు తీవ్ర నష్టదాయకమని ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ యిళ్ల వెంకటేశ్వరరావు (ఐవీ) ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన డీఎస్సీ నోటిఫికేషన్‌లో ఆన్‌లైన్‌లో పరీక్షలు నిర్వహిస్తామని ప్రకటించిందని, ఒక్కోరోజు ఒక్కో అభ్యర్థికి ఒక్కో ప్రశ్నపత్రంతో పరీక్షలు నిర్వహిస్తే కామన్ మెరిట్ ఎలా తీస్తారని ఆయన ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు. డీఎస్సీ అభ్యర్థులందరికీ ఒకే ప్రశ్నపత్రంతో ఒకేరోజు పరీక్ష నిర్వహించాలని డిమాండు చేశారు. అమలాపురం ఎంప్లాయిస్ హోంలో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన జగన్ ప్రభుత్వ తీరును తీవ్రంగా దుయ్యబట్టారు. పాదయాత్రలో భాగంగా అధికారంలోకి వచ్చిన తర్వాత మెగా డీఎస్సీ వేస్తామని నమ్మించి జగన్ ఓట్లు వేయించుకుని ఐదేళ్ల తరువాత మళ్లీ ఎన్నికల వేళ 6100 ఉపాధ్యాయ పోస్టులతో డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయడాన్ని తీవ్రంగా తప్పుపట్టారు. ఉపాధ్యాయ చరిత్రలో అతి తక్కువ సంఖ్యతో మినీ డీఎస్సీ ప్రకటించడం జగన్ మోసపూరిత చర్యగా అభివర్ణించారు. జగన్ పాలనలో 6,100 పోస్టులు అంటే మిగిలిన ఉపాధ్యాయ పోస్టులు రద్దు చేసినట్టా లేక ఉపాధ్యాయ పోస్టులు అవసరం లేదా అని ప్రభుత్వం స్పష్టం చేయాలని డిమాండు చేశారు.

అప్రంటీస్ దుర్మార్గపుచర్య

1994లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఉపాధ్యాయ నియామకాల్లో అప్రంటీస్ విధానాన్ని ప్రవేశపెట్టిందని, ఉపాధ్యాయులు, పీడీఎఫ్ ఎమ్మెల్సీల 16 ఏళ్ల పోరాటాల ఫలితంగా 2010లో అప్రంటీస్ విధానాన్ని రద్దు చేశారని ఐవీ చెప్పారు. 2012 నుంచి రెగ్యులర్ నియామకాలు జరిగాయన్నారు. మళ్లీ ఆ విధానాన్ని జగన్ ప్రభుత్వం ప్రవేశపెట్టడం దుర్మార్గపు చర్య అన్నారు. నిబద్ధతతో కూడిన శిక్షణకోసం అప్రంటీస్ విధానం ప్రవేశపెట్టామని మంత్రి బొత్స చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఉద్యోగులకు చెల్లించాల్సిన రూ.21,585 కోట్ల బకాయిల్లో రూ.5,500 కోట్లు మార్చి నెలాఖరుకు చెల్లిస్తామంటున్న ప్రభుత్వం మిగిలిన బకాయిలను వచ్చే ప్రభుత్వంపైకి గెంటేస్తోందన్నారు. 11వ పీఆర్సీ బకాయిలు చెల్లించని జగన్ ప్రభుత్వం 12వ పీఆర్సీ ఎప్పుడు అమలుచేస్తుందని, దీనిపై ఉద్యోగులంతా ఆందోళన చెందుతున్నారని ఐవీ అన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో తిరుమల జయకేతనం



అత్యుత్తమ పర్సంటైల్ సాధించిన విద్యార్థులతో చైర్మన్ నున్న

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 13: జేఈఈ మెయిన్స్ పరీక్షల్లో రాజమహేంద్రవరంలోని కాతేరు తిరుమల ఐఐటీ అండ్ మెడికల్ అకాడమీ విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించారని తిరుమల విద్యాసంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు తెలిపారు. సోమవారం సాయంత్రం విడుదలైన జేఈఈ మెయిన్-2024 ఫలితాల్లో తమ విద్యార్థులు యు.సుధీర్, ఎన్.యశ్వంత్, ఎంజీవీ మహేష్ 99.99 పర్సంటైల్ సాధించారని తెలిపారు. అలాగే 14 మంది 99.90 పర్సంటైల్, 158 మంది 99.0 పర్సంటైల్, 282 మంది 98 పర్సంటైల్, 606 మందికి 95 పర్సంటైల్, 1022 మందికి 90 పర్సంటైల్ సాధించారని తెలిపారు. సుమారు 950 మంది పైనే విద్యార్థులు తమ పర్సంటైల్ స్కోర్‌తో ఎన్ఐటీ లేదా ఐఐటీలో సీట్లు సాధిస్తారని చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థులను అకడమిక్ డైరెక్టర్ జి.సతీష్‌బాబు, ప్రిన్సిపాల్ వి.శ్రీహరిలతో కలిసి ఆయన అభినందించారు.

జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో 'ఆదిత్య' విద్యార్థుల ప్రతిభ

కాకినాడ రూరల్, ఫిబ్రవరి 13: జేఈఈ మెయిన్-2024 ఫలితాల్లో ఆదిత్య విద్యార్థులు అఖిలభారత స్థాయిలో ఉత్తమ పర్సంటైల్ సాధించినట్టు ఆదిత్య కార్యదర్శి ఎన్.కృష్ణదీపకరెడ్డి తెలిపారు. విద్యార్థులు బి.రఘురామసహన్ 99.95, జి.జగదీష్‌వెంకటసీతారామ్ 99.95, ఏహెచ్ సత్యనిహంత్ 99.94, ఏ.చరణ్‌ఉమేష్ 99.94 పర్సంటైల్‌ను సాధించారన్నారు. అంతేకాకుండా 62 మంది విద్యార్థులు 99.00 పర్సంటైల్‌పైన సాధించి ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరచినట్టు తెలిపారు. ఈ సందర్భంగా అత్యుత్తమ పర్సంటైల్ సాధించిన విద్యార్థులను, వారికి శిక్షణనిచ్చిన అధ్యాపకులను ఆదిత్య చైర్మన్ ఎన్.శేషారెడ్డి, హాస్టల్స్ డైరెక్టర్ లక్ష్మీరాజ్యం, డైరెక్టర్లు శృతి, సుగుణ తదితరులు అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న షిర్డిసాయి విద్యాసంస్థల చైర్మన్ శ్రీధర్

జేఈఈ మెయిన్స్‌లో షిర్డిసాయి హవా

రాజమహేంద్రవరంరూరల్, ఫిబ్రవరి13: జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో రాజమహేంద్రవరం షిర్డిసాయి జూనియర్ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలతో సత్తా చాటారు. ఈ వివరాలను షిర్డిసాయి విద్యాసంస్థల డైరెక్టర్ టి.శ్రీవిద్య వెల్లడించారు. తమ కళాశాల లక్ష్యా అకాడమీలో శిక్షణ పొందుతున్న బి.తనుశ్రీ 99.9 పర్సంటైల్, జె.శ్రీకర్ 99.8, సీహెచ్ భానువెంకటదీపక్ 99.6, ఎం.తాత్వికసాయి 99.4, కె.ప్రదీప్‌శ్రీసత్య 99.4, బి.లక్ష్మణనాయుడు 99.3 పర్సంటైల్‌లో అత్యుత్తమ ప్రతిభ కనపరిచారు. ఆరుగురు విద్యార్థులు 99శాతంపైగా పర్సంటైల్, 15 మంది 98 పైగా, 28 మంది 97పైగా, 53 మంది 95పైగా పర్సంటైల్ సాధించినట్లు శ్రీవిద్య తెలిపారు. విద్యాసంస్థల చైర్మన్ టి.శ్రీధర్ మాట్లాడుతూ తమ విద్యార్థుల్లో 163 మంది విద్యార్థులు అడ్వాన్స్‌కు అర్హత సాధించారన్నారు. విజేతలైన విద్యార్థులను, కృషి చేసిన అధ్యాపక బృందాన్ని చైర్మన్ టి.శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య, లక్ష్యాడీన్ చంద్రశేఖర్‌లు అభినందించారు.



రౌతులపూడిలో మాట్లాడుతున్న మహిళా వలంటీర్

'మేము వైసీపీ కోసమే పనిచేస్తున్నాం'

ఆత్మీయ సమ్మేళనంలో ఓ మహిళా వలంటీర్ వ్యాఖ్య

రౌతులపూడి, ఫిబ్రవరి 13: వలంటీర్లలంతా కేవలం రూ.5 వేల కోసం పనిచేయడం లేదని, వైసీపీ కోసం పనిచేస్తున్నామని రౌతులపూడికి చెందిన సచివాలయం-1 వలంటీర్ అనడం చర్చనీయాంశంగా మారింది. కాకినాడ జిల్లా రౌతులపూడికి మండల పరిషత్ కార్యాలయం వద్ద మంగళవారం మండల వలంటీర్ల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ప్రత్తిపాడు వైసీపీ ఇన్‌చార్జి వరుపుల సుబ్బారావు హాజరయ్యారు. రౌతులపూడి సచివాలయం-1 వలంటీర్ మాట్లాడుతూ వలంటీర్‌గా పీజీలు, డిగ్రీలు చేసిన వారు కేవలం రూ.5 వేల జీతం కోసం కాదని, జగన్ అంటే ఎవరో మాకు తెలియదని, జగన్‌ను తామె చూడలేదని.. అయినా తామంతా కేవలం వైసీపీ కోసం పనిచేస్తున్నామని, మళ్లీ ప్రభుత్వం వస్తే తమను గుర్తించి ఉన్నతస్థాయిలో నిలబడతారని అని పేర్కొంది. మిగిలిన వలంటీర్లు కూడా మాట్లాడుతూ వైసీపీకే పనిచేస్తామని తెలిపారు. అలాగే జడ్పీటీసీ గొల్లు దివాణం వలంటీర్లనుద్దేశించి మాట్లాడుతూ మీ పరిధిలోని ప్రతి 50 కుటుంబాలు వైసీపీకి ఓటు వేయించే బాధ్యత మీదేనన్నారు. వరుపుల సుబ్బారావు మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో వైసీపీ నెగ్గేలా చూడాలని వలంటీర్లను కోరారు.



హత్యకు గురైన దుర్గ.. (పక్కన) ఫైల్‌ఫొటో

భర్త చేతిలో.. భార్య హత్య

- కుండలేశ్వరంలో ఘటన
- ప్రేమించి పెళ్లి చేసుకున్న జంట

కాట్రేనికోన, ఫిబ్రవరి 13: ప్రేమించి పెద్దల సమక్షంలో వివాహం చేసుకున్న భర్త చేతిలో భార్య హత్యకు గురైంది. కుండలేశ్వరం పంచాయతీ టన్నెల్‌పేట గ్రామంలో మంగళవారం ఈ ఘటన చోటుచేసుకుంది. ముమ్మిడివరం మండలం సోముదేవరపాలేనికి చెందిన పెయ్యాల ఈశ్వరరావు, వెంకటలక్ష్మి దంపతుల కుమార్తె దుర్గను కాట్రేనికోన మండలం కుండేశ్వరం పంచాయతీ టన్నెలుపేటకు చెందిన జొన్నాడ దుర్గాప్రసాద్ ప్రేమించుకుని పెద్దల సమక్షంలో 2022 డిసెంబరు 10నలో వివాహం చేసుకున్నాడు. ఏవిధమైన కట్న కానుకలు ఇవ్వలేదు. పెళ్లయిన తర్వాత నుంచి కుటుంబంలో తరచూ గొడవలు జరుగుతుండేవి. దీనిలో భాగంగా సోమవారం సాయంత్రం భార్యభర్తలు గొడవపడ్డారు. ఈ ఘటనలో దుర్గ మృతి చెందింది. భార్య దుర్గను భర్త దుర్గాప్రసాద్ కొట్టడంతో చనిపోయిందని బాధితురాలి బంధువులు ఆరోపిస్తున్నారు. దుర్గ సోదరుడు పెయ్యల శ్రీను ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ముమ్మిడివరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.



రెయిలింగ్‌ను ఢీకొన్న బైక్.. సీఐఎస్ఎఫ్ కానిస్టేబుల్ మృతి

కొవ్వూరు, ఫిబ్రవరి 13: కొవ్వూరు రోడ్డు కం రైలు బ్రిడ్జిపై జరిగిన ప్రమాదంలో సీఐఎస్ఎఫ్ కానిస్టేబుల్ మృతి చెందాడు. చాగల్లు మండలం మల్లవరం గ్రామానికి చెందిన జలాది శిరీష్‌కుమార్ (35) సీఐఎస్ఎఫ్ కానిస్టేబుల్. మూడు రోజుల కిందట బంధువులను పరామర్శించడానికి ఇంటికి వచ్చాడు. ఈనెల 12న ధవళేశ్వరం బంధువుల ఇంటికి వెళ్లి పని ముగించుకుని తిరిగి పల్సర్ బైక్‌పై ఇంటికి బయలుదేరాడు. మంగళవారం తెల్లవారుజామున 2 గంటల సమయంలో మార్గమధ్యంలో రోడ్డు కం రైలు బ్రిడ్జిపై కొవ్వూరు వైపు బైక్ అదుపుతప్పి రెయిలింగ్‌ను ఢీకొట్టింది. దీంతో బైక్ పైనుంచి కింద పడిపోయిన శిరీష్‌కుమార్ తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పట్టణ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. శిరీష్‌కుమార్‌కు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉండగా ఆమె ప్రస్తుతం మూడు నెలల గర్భిణి. ఈ ప్రమాదంతో మల్లవరంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ కె.జగన్మోహనరావు తెలిపారు.



విద్యార్థులు, అధికారితో మాట్లాడుతున్న రెడ్డి సుబ్రహ్మణ్యం

గురుకుల పాఠశాల స్థితిగతులపై కలెక్టర్ చర్యలు తీసుకోవాలి

రెడ్డి సుబ్రహ్మణ్యం

ద్రాక్షారామ, ఫిబ్రవరి 13: రామచంద్రపురం మండలం ఆదివారపుపేట బాలుర గురుకుల పాఠశాలలో కలుషిత ఆహారంతో విద్యార్థులు అస్వస్థతకు గురికావడం, పాఠశాలలో స్థితిగతులపై జిల్లా కలెక్టర్ చర్యలు తీసుకోవాలని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి రెడ్డి సుబ్రహ్మణ్యం కోరారు. మంగళవారం ఆదివారపుపేటలో గురుకుల పాఠశాలను ఆయన సందర్శించారు. విద్యార్థులకు పెడుతున్న భోజనాలు, తాగునీరు, పరిసరాలను ఆయన పరిశీలించారు. పాఠశాలలో తనిఖీలకు వచ్చిన ఫుడ్‌సేఫ్టీ అధికారితో ఆయన మాట్లాడారు. తాను తనిఖీలకు వచ్చి రెండేళ్లు అయిందని చెప్పగా ఆయనపై రెడ్డి సుబ్రహ్మణ్యం అసహనం వ్యక్తంచేశారు. పాఠశాల ప్రిన్సిపాల్, ఇతర సిబ్బందితో పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఫుడ్ పాయిజన్ జరిగితే తల్లిదండ్రులపై నెపం వేస్తున్నారని మండిపడ్డారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో రక్షితమంచినీరు లేకపోవడంతో బోరు నీరు తాగడంతో విద్యార్థులు అస్వస్థతకు కారణమని ఆరోపించారు. 500 మంది పేద పిల్లలు చదువుకునే గురుకుల పాఠశాలకు రక్షిత మంచినీరు ఏర్పాటు చేయకపోవడం ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనమన్నారు. పిల్లలకు రక్షిత మంచినీరు ఇవ్వాలని, మెను ప్రకారం భోజనాలు పెట్టాలని లేనిపక్షంలో టీడీపీ తరఫున ఉద్యమం చేస్తామన్నారు. జిల్లా కలెక్టరు సంఘటనపై స్పందించి విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండు చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షులు అక్కల రిష్యంత్‌రాయ్, పట్టణ టీడీపీ అధ్యక్షుడు కడియాల రాఘవన్, క్లస్టర్ ఇన్‌చార్జి పెంకె సాంబశివరావు, టీడీపీ నాయకుల సలాది రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయాలి : పీడీఎస్‌యూ

పాఠశాలను సందర్శించిన పీడీఎస్‌యూ నాయకుడు బి.సిద్ధూ, స్టూడెంట్స్ జేఏసీ నాయకుడు ప్రత్తిపాటు బులిరాజు తదితరులు మాట్లాడుతూ నాణ్యతలేని చికెన్, గుడ్డు వల్ల ఫుడ్‌పాయిజన్ జరిగిందన్నారు. నాడు-నేడులో రూ.50 లక్షలు రక్షిత మంచినీటికి కేటాయించినా రక్షిత మంచినీరు అందడం లేదన్నారు. ఆహార పదార్థాలు సరఫరా చేసే కాంట్రాక్టు రద్దు చేయాలని, నిర్లక్ష్యం వహిస్తున్న ప్రిన్సిపాల్ నాగేశ్వరరావును సస్పెండ్ చేయాలని డిమాండు చేశారు.

ఆసుపత్రి నుంచి విద్యార్థుల డిశ్చార్జి

కలుషిత ఆహారంతో అస్వస్థతకు గురై రామచంద్రపురం ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందిన 8 మంది విద్యార్థులను మంగళవారం మధ్యాహ్నం డిశ్చార్జి చేశారు. వారి ఆరోగ్యం కుదుట పడటంతో విద్యార్థులను పంపివేసినట్లు సూపరింటెండెంట్ డాక్టర్ వీరభద్రుడు తెలిపారు. కాగా మంగళవారం జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి ఆదేశాలతో విద్యార్థులకు మలం పరీక్షలు నిర్వహించేందుకు నమూనాలు సేకరించారు.



గంజాయితోపాటు వాహనాలు, నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు

22 కిలోల గంజాయి స్వాధీనం

మోతుగూడెం, ఫిబ్రవరి 13: రెండు వేర్వేరు కేసుల్లో మోతుగూడెం పోలీస్‌స్టేషన్ చెక్‌పోస్టు వద్ద 22 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు మోతుగూడెం ఎస్ఐ జి.గోపాలరావు తెలిపారు. గంజాయి విలువ రూ.1.10 లక్షలు ఉంటుందన్నారు. నెల్లూరుకు చెందిన షేక్ వరీజ్, షేక్ సుభాని, సూరిపోగు లక్ష్మీసాయి వెంకట్ రెండు వాహనాల్లో 20 కిలోల గంజాయిని ఒడిసా నుంచి తీసుకొస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. అలాగే గుంటూరుకు చెందిన జిన్నాబత్తిన భరత్, సింగపల్లి చరణ్, మేడికొండూరు విశాల్‌కుమార్, షేక్ మస్తాన్ కలిసి ఒడిసా నుంచి కారులో రెండు కిలోల గంజాయిని తీసుకు వెళ్తుండగా పోలీసులు పట్టుకున్నారు. మొత్తం ఏడుగురు నిందితులను అరెస్టుచేసి, 22 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

అదృశ్యమైన గురుకుల విద్యార్థులు కాకినాడలో లభ్యం



పోలీస్‌స్టేషన్ వద్ద అదృశ్యమైన విద్యార్థులను తల్లిదండ్రులకు అప్పగిస్తున్న పోలీసులు

అల్లవరం, ఫిబ్రవరి 13: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం గోడి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల నుంచి సోమవారం అదృశ్యమైన ఇద్దరు విద్యార్థులను కాకినాడ బస్టాండు వద్ద రూరల్ సీఐ పి.వీరబాబు నేతృత్వంలో అల్లవరం పోలీసులు మంగళవారం పట్టుకున్నారు. అల్లవరం మండలం కొమరగిరిపట్నానికి చెందిన మెల్లం నాగేంద్రబాబు, కాట్రేనికోన మండలం బట్టుచెరువుకు చెందిన గుర్రాల టోనీబాబు గోడి గురుకుల పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నారు. సోమవారం వారిద్దరూ కనిపించకుండా వెళ్లిపోయారని ప్రిన్సిపల్ నక్కా శ్రీనివాస్ అల్లవరం పోలీసులకు ఫిర్యాదుచేశారు. డీఎస్పీ పర్యవేక్షణలో సీఐ వీరబాబు ఆధ్వర్యంలో పోలీసుల బృందం గాలింపు చర్యలు చేపట్టింది. కాకినాడ బస్టాండులో వారిని గుర్తించి అల్లవరం పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చారు. ప్రిన్సిపల్ సమక్షంలో తల్లిదండ్రులకు పోలీసులు అప్పగించారు. కేసును ఛేదించిన సీఐ వీరబాబును, అల్లవరం పోలీసులను ఎస్పీ శ్రీధర్ అభినందించారు.



నాపై సామాజిక మాధ్యమాల్లో దుష్ప్రచారం

తూర్పు ఎస్పీకి ఏపీ బీజేపీ ఉపాధ్యక్షురాలు గీత ఫిర్యాదు

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి13 (ఆంధ్రజ్యోతి): ఆరు నెలలుగా తనపై ఉద్దేశపూర్వకంగా దుష్ప్రచారంతో పరువుకు నష్టం కలిగించేవిధంగా సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారని.. మానసికంగా వేధిస్తున్నారని మాజీ ఎంపీ, ఏపీ బీజేపీ ఉపాధ్యక్షురాలు కొత్తపల్లి గీత మంగళవారం తూర్పు గోదావరి జిల్లా ఎస్పీ జగదీశ్‌కి రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. అనంతరం మీడియాతో ఆమె మాట్లాడుతూ.. "నాకు 53 ఏళ్లు. డిప్యూటీ కలెక్టర్‌గా కూడా పని చేశాను. నా తండ్రి వాల్మీకి కులానికి చెందినవారు. ఆయన కూతురుగా నేను కూడా అదే కులానికి చెందుతానని 2017లో డీఎల్ఎస్‌సీలో కలెక్టర్ ఆదేశాలిచ్చారు. గెజిట్ నోటిఫికేషన్ కూడా వచ్చింది. చట్ట ప్రకారం గెజిట్‌ని చాలెంజ్ చేసే ప్రొవిజన్స్ లేవు. కానీ కొందరు పలుకుబడి ఉపయోగించి కేవలం స్వలాభం కోసం నా కుల ధ్రువీకరణ సర్టిఫికెట్‌పై ఒక ఆర్డర్ తీసుకొచ్చారు. దానిపై కోర్టును ఆశ్రయించాం. కోర్టు ఆ ఆదేశాలను సస్పెండ్ చేసింది. అందువల్ల గెజిట్ ప్రకారం నేను వాల్మీకి అన్నదే నిలుస్తుంది. ఎవరూ కూడా దానిని చాలెంజ్ చేయలేరు. గెజిట్ ఒకసారి విడుదలైన తర్వాత దానిపై ఎలాంటి చర్యలూ చేపట్టే అధికారం ప్రభుత్వానికి లేదు. ఎందుకంటే డిస్ట్రిక్ట్ లెవెల్ సెలక్షన్ కమిటీ(డీఎల్ఎస్‌సీ) ఉత్తర్వులే ఫైనల్. ఈ పరిస్థితుల్లో పని కట్టుకుని గతంలో బీజేపీ ఎంపీగా పోటీ చేసిన కాశీ విశ్వనాథ్ సత్యనారాయణరెడ్డి కేవలం స్వలబ్ధితో అసహ్యకరమైన కామెంట్స్ చేయడంతోపాటు సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తున్నారు. మానసిక వేదనకు గురిచేస్తున్న నిమ్మక జయరాజు గతంలో ఎమ్మెల్యేగా పనిచేశారు. ఆదివాసీ అసోసియేషన్‌ని జయరాజు పెట్టారు. దానిని రేగు మహేశ్వరరావు, ఈలి ఆంజనేయులు అనే గిరిజనేతరులు నిర్వహిస్తున్నారు. ఆ సోసియేషన్ ఆదివాసీల మేలు కోసం చేసిన పనులేమీ లేవు. అన్నీ బ్లాక్ మెయిలింగ్ పనులే చేస్తోంది. ఆ అసోసియేషన్‌పై జ్యుడిషియల్ విచారణకు హైకోర్టును ఆశ్రయిస్తున్నాను. పరువు నష్టం దావా వేస్తాను. ఆరకులో బ్యాంక్ లోన్ తీసుకొని ఎగ్గొట్టేశామని దుష్ప్రచారం చేస్తున్నారు. వ్యాపారంలో లోన్లు తీసుకోవడం సర్వసాధారణం. తర్వాత కొన్ని ఇబ్బందులు ఎదురయ్యాయి. రూ.25 కోట్లు అప్పు తీసుకుంటే వడ్డీతోసహా రూ.65 కోట్లు పూర్తిగా చెల్లించాం. లోన్ తీరినట్టు బ్యాంక్ క్లియరెన్స్ లెటర్ కూడా ఇచ్చింది. అవన్నీ కోర్టులో ఫైల్ చేశాం. మేము బ్యాంకును మోసం చేశామని ప్రచారం చేస్తున్నారు" అని ఆమె వివరించారు. వీటన్నిటిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎస్పీకి ఫిర్యాదు చేశానని, కోర్టును కూడా ఆశ్రయిస్తానని తెలిపారు.

ఆటో చోరీ కేసులో నిందితులకు 6 నెలల జైలు

ధవళేశ్వరం, ఫిబ్రవరి13: ఇంటి ముందు పార్కుచేసిన ఆటోను గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించినట్టు పి.రమణ ఫిర్యాదుమేరకు గత సంవత్సరం జూన్‌లో అప్పటి సీఐ కె.మంగాదేవి కేసు నమోదు చేశారు. సౌత్ జోన్ డీఎస్పీ పర్యవేక్షణలో దర్యాప్తు చేసి పి.రవివర్మ, పి.దుర్గాప్రసాద్, పి.స్వాతిలను అరెస్ట్ చేసి, దొంగిలించిన ఆటోను స్వాధీనం చేసుకుని కోర్టుకు తరలించారు. ఈ కేసును త్వరితగతిన విచారణ జరిపి నిందితులను 3వ అదనపు జ్యుడీషియల్ కోర్టులో ప్రవేశపెట్టగా జడ్జి సి.రమ్య ముగ్గురు ముద్దాయిలకు ఆరు నెలలు జైలుశిక్ష విధించినట్టు ప్రస్తుత సీఐ జీవీ వినయ్‌మోహన్ తెలిపారు. ఈ కేసులో ముద్దాయిలకు శిక్ష పడేలా కృషిచేసిన ఏపీపీ కేఎస్ఎస్ లక్ష్మీదేవి, కోర్టు కానిస్టేబుల్ రమేష్‌లను డీఎస్పీ అంబికా ప్రసాద్, సీఐ వినయ్‌మోహన్‌లు అభినందించారు.



సమావేశమైన డీఎంఆర్ శేఖర్, జనసేన నేతలు

రేపు అమలాపురంలో పవన్ పర్యటన?

నాలుగు నియోజకవర్గాల నేతలతో సమావేశాలు

అమలాపురం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ఈనెల 15న కోనసీమ కేంద్రమైన అమలాపురంలో పర్యటించనున్నారు. ప్రస్తుతం ఆయన టూరుకు సంబంధించి ప్రాథమిక షెడ్యూల్ విడుదలైంది. తొలుత భీమవరంలో పర్యటన ముగించుకుని బుధవారం రాత్రికి అమలాపురం చేరుకుంటారని సమాచారం ఉండగా, అనుమతులు రాకపోవడంతో అక్కడ రద్దయింది. అయితే 15వ తేదీ ఉదయం పవన్ ఇక్కడకు చేరుకుంటారని సమాచారం. షెడ్యూల్ ప్రకారం నాలుగు నియోజకవర్గాల నాయకులతో వేర్వేరుగా సమావేశాలు నిర్వహిస్తారు. అమలాపురం నియోజకవర్గంలోని క్రైస్తవులతో 9.30 గంటల నుంచి గంటసేపు సమావేశమవుతారు. ఆ తర్వాత జనసేన ముఖ్య నేతలతో 10.30 నుంచి 11.30 గంటల వరకు భేటీ అవుతారు. 11.30 నుంచి 12.30 గంటల వరకు అమలాపురం, రాజోలు నియోజకవర్గాల టీడీపీ ముఖ్య నాయకులతో సమావేశమవుతారు. మధ్యాహ్నం 1 గంట నుంచి 2 గంటల వరకు రాజోలు నియోజకవర్గ ముఖ్య నాయకులు 40 మందితో, మధ్యాహ్నం 2 నుంచి 3 గంటల వరకు కొత్తపేట, పి.గన్నవరం నియోజకవర్గాల ముఖ్య నాయకులతో సమావేశాలు నిర్వహించనున్నారు. అయితే ఈ పర్యటనను బుధవారం మరోసారి ధ్రువీకరిస్తారు. కాగా జనసేన అధినేత పవన్‌కల్యాణ్ పర్యటనకు అడ్డంకులు కల్పించడాన్ని ఆ పార్టీ కేడర్ తీవ్రంగా పరిగణిస్తోంది. హెలికాప్టర్ దిగేందుకు ఆర్అండ్‌బీ అధికారులు అభ్యంతరం చెప్పడం వెనుక ప్రభుత్వం కుట్ర ఉందనే ఆగ్రహంతో కొందరు యువకులు మంగళవారం రాత్రి అమలాపురంలో కలెక్టరేట్ వద్ద భారీగా గుమిగుడారు. అధికారులెవ్వరూ లేకపోవడంతో వెనుతిరిగారు. మరోవైపు జనసేన పార్లమెంటరీ ఇన్‌చార్జి డీఎంఆర్ శేఖర్ ఆధ్వర్యంలో స్థానికంగా ఓ హోటల్‌లో సమావేశమయ్యారు. మరోవైపు జనసేన అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి శెట్టిబత్తుల రాజబాబు ఆధ్వర్యంలో ఆయన వర్గీయులు హైస్కూలు సెంటర్‌లోని కన్వెన్షన్ హాలులో మీటింగ్ ఏర్పాట్లను పరిశీలించారు.

ఆగి ఉన్న టిప్పర్‌ను ఢీకొన్న బస్సు

నల్లజర్ల, ఫిబ్రవరి 13: ఆగి ఉన్న టిప్పర్‌ను ట్రావెల్ బస్సు ఢీకొనడంతో బస్సు డ్రైవర్‌కు, ఓ ప్రయాణికుడికి స్వల్పగాయాలయ్యాయి. మండలంలోని అచ్చన్నపాలెం బస్సు షెల్టర్ వద్ద ఆగి ఉన్న టిప్పర్‌ను మంగళవారం తెల్లవారుజామున పార్వతీపురం నుంచి విజయవాడ వెళుతున్న సాయి ఆర్‌కే ట్రావెల్ బస్సు వెనుక నుంచి వేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బస్సు డ్రైవర్ సూర్యకుమార్‌కు చెయ్యి విరిగిపోగా ప్రయాణికుడు విజయవాడకు చెందిన అనుపోజు వెంకటరత్నం నుదుటిపై గాయమైంది. ఇద్దరినీ అంబులెన్స్‌లో ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఏజెన్సీ సమాచారం

తరలిపోతున్న మామిడిచెట్లు

● అటవీ శాఖ చోద్యం ● ఎంపీపీ ఆగ్రహం



అక్రమ కలప రవాణాపై విలేకర్లతో మాట్లాడుతున్న ఎంపీపీ ఆనందరావు

వై.రామవరం, ఫిబ్రవరి13: అల్లూరిజిల్లా అడ్డతీగల రేంజ్ పరిధిలో పలు గ్రామాల్లో మామిడిచెట్లను తరలించుకుపోతుంటే వ్యాపారులకు కొమ్ముకాస్తూ అటవీ శాఖ చోద్యం చూస్తోందని మండల పరిషత్ అధ్యక్షుడు కడబాల ఆనందరావు తీవ్రంగా మండిపడ్డారు. వై.రామవరం మండలంలో మైదాన ప్రాంతాల నుంచి వచ్చిన కొందరు వ్యాపారులు గిరిజన రైతులను మభ్యపెట్టి చెట్టుకు రూ.1000 నుంచి 1500 వరకు వారికి ఆశచూపి మిషన్లతో భారీ వృక్షాలను నరికేసి తరలించుకుపోతున్నారని ఎంపీపీ ఆరోపించారు. రైతుల పట్టాల పేరుతో కొన్ని సందట్లో సడేమియా అంటూ వందల చెట్లను తరలించుకుపోతున్నారని మామిడిచెట్లతో పాటు వేప, టేకు వంటి మారుజాతి కలపను భారీగా తరలిస్తున్నా అటవీశాఖాధికారులు పట్టించుకోవడంలేదని తెలిపారు. మామిడిచెట్లు గిరిజన గ్రామాల్లో పశువులు(ఆవులు, మేకలు)కు జీవనాధారంగా ఉంటున్నాయని వేసవికాలంలో మామిడిచెట్ల కింద సేదతీరుతూ మామిడిపండ్లను తింటూ ఆకలి తీర్చుకునే మూగజీవాలకు జీవనాధారం లేకుండా చేస్తున్నారని దుయ్యబట్టారు. ఇంత జరుగుతున్న రేంజ్ అధికారికి ఏమీ తెలియకుండా ఉంటుందా అని ఆయన ప్రశ్నించారు. పర్యావరణానికి ముప్పు వాటిల్లితే తాము చూస్తూ ఊరుకోమని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ కర్రా వెంకటలక్ష్మి, వైసీపీ నాయకులు మంచినీళ్ల నారాయణరావు పాల్గొన్నారు.

జీడిమామిడి, మామిడి తోటల్లో మెళుకులు పాటిస్తే అధిక దిగుబడులు

● శాస్త్రవేత్త డాక్టరు రాజేంద్ర ప్రసాద్



రైతులకు స్ప్రేయర్లు అందిస్తున్న దృశ్యం

రంపచోడవరం, ఫిబ్రవరి 13: జీడిమామిడి, మామిడి తోటల్లో మెళుకులు పాటిస్తే అధిక దిగుబడులు పొందవచ్చునని పందిరిమామిడి కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టరు రాజేంద్రప్రసాద్ అన్నారు. మంగళవారం మండలంలోని తామరపల్లి రైతు భరోసా కేంద్రంలో ఎంపీటీసీ వంశీ కుంజం ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జీడిమామిడి, మామిడి తోటలు పూత, పిందె దశలో తీసుకోవలసిన జాగ్రత్తలపై రైతులకు వివరించారు. అలాగే తాటికల్లు ద్వారా తాటి నీర, తాటి బెల్లం తయారీపై అవగాహన కల్పించారు. అనంతరం రైతులకు స్ప్రేయర్లను అందజేశారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త డాక్టరు వెంగయ్య, ఆర్‌బీకే చైర్మన్ అబ్బులు, అగ్రికల్చర్ అసిస్టెంట్ భాస్కర్ పాల్గొన్నారు.

జాఫ్రా గింజలు కొనుగోలుకు చర్యలు: పీవో



సమావేశంలో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే

రంపచోడవరం, ఫిబ్రవరి 13: ఏజెన్సీలో రైతులు పండించిన జాఫ్రా గింజలను ఐటీడీఏ ద్వారా కొనుగోలు చేస్తామని పీవో సూరజ్ గనోరే అన్నారు. మంగళవారం స్థానిక ఐటీడీఏ కార్యాలయ చాంబరులో ఆయన వెలుగు, గిరిజన సహకార సంస్థ(జీసీసీ), హార్టికల్చర్ అధికారులు, వివిధ కంపెనీల ప్రతినిధులు, వ్యాపారవేత్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ గిరిజన రైతులు దళారులతో మోసపోకుండా చర్యలు చేపట్టామన్నారు. కొనుగోలు చేసిన జాఫ్రా గింజలను వేలము లేదా వివిధ కంపెనీలకు సరఫరా చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏపీవో(జీ) సీహెచ్ శ్రీనివాసరావు, జీసీసీ డీఎం జి.పార్వతీశ్వరరా వు, ఏపీడీ ఎ.శ్రీనివాసరావు, పీహెచ్‌వో చిట్టిబాబు, వెలుగు యాంకర్ పర్సన్ రామరాజు, వివిధ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

మంగంపాడులో పోలింగ్‌పై అవగాహన కార్యక్రమం



ఓటింగ్‌పై అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్, ఎస్ఐ

మోతుగూడెం, ఫిబ్రవరి 13: వై.రామవరం మండలం బొడ్డగండి పంచాయతీ మంగంపాడు గ్రామంలో తహసీల్దార్ నాగరాజు, డొంకరాయి ఎస్ఐ శివకుమార్ మంగళవారం మాక్ డ్రిల్ నిర్వహించి ఓటర్లకు అవగాహన కల్పించారు. ఓటు వేసే విధానం హక్కుపై అవగాహన కల్పించారు. డొంకరాయి, మంగంపాడు పోలింగ్ బూత్‌లను సందర్శించారు.

గాదరాడలో బత్తుల మహాపాదయాత్ర



గాదరాడలో మహాపాదయాత్ర నిర్వహిస్తున్న బత్తుల బలరామకృష్ణ

కోరుకొండ, ఫిబ్రవరి13: గాదరాడ గ్రామంలో మంగళవారం జనసేన పార్టీ ఇన్‌చార్జ్ బత్తుల బలరామకృష్ణ, ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లా జనసేన కోఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మి ఆధ్వ ర్యంలో మంగళవారం సాయంత్రం మహాపాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, మహాత్మాగాంధీ, ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గ్రామంలో జనం కోసం జనసేన మహాపాదయాత్ర నిర్వహించారు.

నేటి నుంచి ఉద్యోగుల నిరసనలు

కోరుకొండ, ఫిబ్రవరి 13: వైసీపీ ప్రభుత్వంలో గడిచిన నాలుగున్నర సంవత్సరాలలో ఉద్యో గులకు అన్యాయం చేసిందన్నారు. ఉద్యోగుల సమస్యలు పరిష్కారం కోసం ఈనెల 14,15,16 తేదీల్లో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలియజేయాలని ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక పెన్షనర్ల ఐక్య కార్యాచరణ సమితి నిర్ణయించింది. ఈమేరకు మంగళవారం కోరుకొండలో ఏపీ జేఏసీ కోరుకొండ యూనిట్ అధ్యక్షుడు చొల్లంగి త్రినాథ్ సూర్యకుమార్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. 3రోజులు నిరసన అనంతరం 17న భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు వారు పేర్కొన్నారు. సమావేశంలో సీహెచ్ విజయకృష్ణ, యూటీఎఫ్ నాయకులు మోహన్, పీఆర్‌టీయూ నాయకులు నాగేశ్వరరావు, ఏపీ జేఏసీ సభ్యులు పాల్గొన్నారు.



కోరుకొండలో ధర్నా నిర్వహిస్తున్న ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక పెన్షనర్ల ఐక్య కార్యాచరణ సమితి

బ్రాహ్మణుల సంక్షేమానికి టీడీపీ-జనసేన పెద్దపీట

● బ్రాహ్మణ ఆత్మీయ సమావేశంలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేమూరి



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేమూరి ఆనంద్ సూర్య

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 13: బ్రాహ్మణ సంక్షేమానికి టీడీపీ, జనసేన పార్టీలు పెద్దపీట వేయనున్నాయని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేమూరి ఆనంద్‌సూర్య అన్నారు. రాజమహేంద్రవరం హోటల్ జగదీశ్వరీలో మంగళవారం జరిగిన టీడీపీ-జనసేన బ్రాహ్మణుల ఆత్మీయ సమావేశానికి ఆయనతోపాటు మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆదిరెడ్డి శ్రీనివాస్, జనసేన సిటీ ఇన్‌చార్జి అనుశ్రీ సత్యనారాయణ, నగర అధ్యక్షుడు వై.శ్రీను, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ యనమండ్ర సాయిసురేష్ ముఖ్య అతిథులుగా విచ్చేసి మాట్లాడారు. తెలుగుదేశం ప్రభుత్వంలో బ్రాహ్మణుల సంక్షేమానికి అనేక అభివృద్ధి పథకాలు అమలు చేసిందని, అయితే ప్రస్తుత ప్రభుత్వం ప్రతి పథకాన్ని నిర్వీర్యం చేసిందన్నారు. టీడీపీ-జనసేన కూటమి అధికారంలోకి వస్తే బ్రాహ్మణుల ఆర్థిక, రాజకీయ, సామాజిక అభివృద్ధికి సహకరిస్తుందన్నారు. సమావేశంలో టీడీపీ నగర అధ్యక్షుడు రెడ్డి మణి, ముత్య సత్తిబాబు, భమిడిపల్లి బాబు, నిమిషకవి వెంకటేష్, కోలగంటి రమేష్, భాగవతుల అయ్యప్ప, మజ్జి రాంబాబు, యిన్నమూరి రాంబాబు, మిస్కా జోగినాయుడు, బ్రాహ్మణ ప్రముఖులు, రాష్ట్రీయ బ్రాహ్మణ సంఘటన్ నాయకులు పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యమే ధ్యేయం

● టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆదిరెడ్డి శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 13: పేదల మధ్యతరగతి ప్రజలకు సంపూర్ణ ఆరోగ్యమే తమ ధ్యేయమని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. స్థానిక 44, 47 డివిజన్లలో మంగళవారం భవాని చారిటబుల్ ట్రస్ట్, వాసవిశ్రీ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరాలను ఆయన ముఖ్యఅతిథిగా ప్రారంభించారు. వైద్య పరీక్షలు చేయించుకున్న వారికి ఉచితంగా ఆయన టీడీపీ నాయకులతో కలిసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నగర ప్రధాన కార్యదర్శి బుడ్డిగ రాధ, యాళ్ల ప్రదీప్, జవ్వాది మురళీ, పాలవలస భద్రం, బేసరి చిన్ని, కవులూరి వెంకట్రావు, సంసాని ప్రసాద్, అగురు ధనరాజ్ పాల్గొన్నారు.



రేలంగికి పార్టీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న చంద్రబాబు చిత్రంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామకృష్ణారెడ్డి

చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరిన బీసీ నేత రేలంగి

అనపర్తి, ఫిబ్రవరి 13: అనపర్తి నియోజకవర్గం బిక్కవోలు మండలం కొమరిపాలెం గ్రామానికి చెందిన బీసీ నేత రేలంగి నాగేశ్వరరావు మంగళవారం ఉండవల్లిలోని చంద్రబాబు నివాసంలో టీడీపీలో చేరారు. టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో రేలంగికి చంద్రబాబు టీడీపీ కండువాకప్పి పార్టీలోకి ఆహ్వానించారు. 2019లో జనసేన పార్టీ తరఫున అనపర్తి నియోజకవర్గం అసెంబ్లీ అభ్యర్థిగా పోటీ చేశారు. రేలంగి నియోజక వర్గంలో రామకృష్ణారెడ్డి ప్రజలపక్షాన నిలుస్తూ చేస్తున్న పోరాటాలకు ఆకర్షితుడైన రేలంగి తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో చంద్రబాబుపాలన చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ సేవా తత్పరుడు రేలంగి వంటి నాయకుడు టీడీపీ ఎంతో అవసరమని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ రైతు నాయకుడు నల్లమిల్లి సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

లోకేశ్‌ను కలిసిన పెందుర్తి అభిరామ్



నారా లోకేష్‌ను కలిసిన పెందుర్తి అభిరామ్

సీతానగరం, ఫిబ్రవరి 13 : మాజీ ఎమ్మెల్యే పెందుర్తి వెంకటేష్ తనయుడు టీడీపీ యువ నాయకుడు పెందుర్తి అభిరామ్ శ్రీకాకుళంలో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళవారం శ్రీకాకుళంలోని పాతపట్నంలో జరుగుతున్న యువ శంఖారావం కార్యక్రమానికి హాజరైన నారా లోకేష్‌ను కింజారపు రామ్మోహన్‌ను కలుసుకున్నారు.

పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలను పర్యవేక్షించాలి: కమిషనర్

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 13: బూత్ లెవెల్ అధికారులు తమ పరిధిలోని పోలింగ్ కేంద్రాల్లో ప్రాథమిక సౌకర్యాలను ఎప్పటికప్పుడు పర్యక్షించాలని రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కమిషనర్ దినేష్‌కుమార్ ఆదేశించారు. మంగళవారం ఆయన నగరంలోని జైల్ వార్డర్ లైన్స్ మునిసిపల్ కార్పొరేషన్ ప్రాథమిక పాఠశాల, క్వారీపేట మునిసిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల, సిద్ధార్థ నగర్ మునిసిపల్ కార్పొరేషన్ ప్రాథమిక పాఠశాల టౌన్ హైస్కూల్, బత్తుల మల్లిఖార్జునరావు మునిసిపల్ కార్పొరేషన్ ప్రాథమిక పాఠశాల, కంటిపూడి రామారావు కార్పొరేషన్ హైస్కూల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను ఆయన బూత్‌లెవెల్ అధికారులు, సూపర్‌వైజర్లు, సెక్టారు అధికారులు, ఇంజనీరింగ్ అధికారులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ బీఎల్‌వోలు కొత్తగా నమోదైన ఓటర్లను కూడా కలుపుకొని తమ పోలింగ్‌కేంద్రాల్లో ఓటర్లు 1400 మంది కన్నా ఎక్కువ ఉంటే ఎక్సిలరీ పోలింగ్ స్టేషన్ ఏర్పాటు చేసేందుకు ఉన్న అవకాశాలను పరిశీలించి సెక్టారు అధికారి ద్వారా నివేదిక ఇవ్వాలన్నారు. బీఎల్‌వోలు తమ పరిధిలో ఎంత మందికి హోమ్ ఓటింగు సౌకర్యం కల్పించారో లెక్కతేల్చాలని, ఓటరు అంగీకారంతోనే హోమ్ ఓటింగు సిఫార్సు చేయాలని ఆదేశించారు. పాఠశాలల్లో నెలకొల్పిన పోలింగ్ కేంద్రాలను పరిశీలించే సమయంలో అక్కడ ఉన్న విద్యార్థులతో స్కూల్లో వున్న సౌకర్యాలపై ఆరా తీశారు. మధ్యాహ్నభోజన పథకం అమలుతీరును పరిశీలించారు. కార్యక్రమంలో ఈఈ ఆర్‌వీఎస్ శేషగిరిరావు, ఎలక్షన్ డీటీ పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

భవిత కేంద్రం పరిశీలన



భవిత కేంద్రంలో విద్యార్థులతో మాట్లాడుతున్న స్నేహలత

రంగంపేట, ఫిబ్రవరి 13: భవిత కేంద్రాల్లో ప్రత్యేక అవసరాలగల విద్యార్థులు ట్యాబ్‌లను వినియోగించుకొని, శాస్త్ర, సాంకేతిక విద్యాభ్యాసాన్ని కొనసాగించడం బాగుందని జిల్లా సమగ్ర శిక్షా అకౌంట్స్ ఆఫీసర్, ఐ.ఈ కోఆర్డినేటర్ జె.స్నేహలత అన్నారు. మంగళవారం తూర్పుగోదావరిజిల్లా రంగంపేట భవిత కేంద్రాన్ని ఆమె పరిశీలించి మాట్లాడారు. విద్యార్థులు ట్యాబ్స్ బోధనా పరికరాలు వినియోగంలో ఉపాధ్యాయులు కృషిని ఆమె అభినందించారు. జిల్లాలో 19 భవిత కేంద్రాలు ఉన్నాయని ఆ కేంద్రాలలో విద్యార్థులకు అవసరమైన ట్యాబ్‌లను, బోధనోపకరణాలను, వినికిడి యంత్రాలను, కృత్రిమ అవయవాలను సమకూర్చామన్నారు. వారానికి ఒక రోజు ఫిజియోథెరపీ ద్వారా శారీరక ఆరోగ్యంపై విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు ప్రయోగాత్మక శిక్షణ ఇస్తున్నామన్నారు. జిల్లాలో రంగంపేట భవిత కేంద్రం నిర్వహణలో ఐఈఆర్టీ కోఆర్డీనేటర్లు ఎం.వి.ఎస్.ప్రసాద్, జి.అంజలిల కృషిని ఆమె ప్రశంసించారు. కార్యక్రమంలో సీఆర్‌ఎంటీ ఎల్.శ్రీనివాసరాజు, పాఠశాల ఉపాధ్యాయుడు పి.సూర్యకృష్ణ, పాల్గొన్నారు.

పలు అభివృద్ధి పనులు ప్రారంభం

కడియం, ఫిబ్రవరి 13: కడియం మండలంలో మంగళవారం మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ పలు అభివృద్ధి పనులు ప్రారంభించారు. జేగురుపాడు జగనన్న లేఅవుట్‌లో రూ.3కోట్ల 58 లక్షలతో ఏర్పాటు చేసిన విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ప్రారంభించారు. కడియంలో రూ.75 లక్షలతో నిర్మించిన రైతుబజార్‌కు శంకుస్థాపన చేశారు. వేమగిరి జక్కంపూడి నగర్‌లో చిలుకూరి బ్రదర్స్ నిర్మించిన డాక్టర్ వై ఎస్ రాజశేఖరరెడ్డి, జక్కంపూడి రామ్మోహనరావు విగ్రహాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జేగురుపాడు సర్పంచ్ యాదల స్టాలిన్, వైసీపీ రాష్ట్ర కార్యదర్శి గిరజాల బాబు, డా. గూడూరి శ్రీనివాస్, విద్యుత్ శాఖ ఎస్ఈ టీఎస్ఎన్ మూర్తి, తహసీల్దారు రమాదేవి, ఎంపీడీవో మనోజ్, తదితరులు పాల్గొన్నారు.

లోక కల్యాణార్థం రాజశ్యామల యాగం



రాజ శ్యామల యాగం నిర్వహిస్తున్న శ్రీనివాసరావు దంపతులు

గోకవరం, ఫిబ్రవరి 13: లోక కల్యాణార్థం రాజశ్యామల యాగాన్ని మంగళవారం గోకవరంలో వైభవంగా నిర్వహించారు. తంటికొండ రోడ్‌లో ఉన్న సీఎండీ కేఎస్‌పీపీ ఫిన్స్ లే అవుట్ ప్రాంగణంలో విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన వ్యవస్థాపక అధ్యక్షుడు కంబాల శ్రీనివాసరావు దంపతుల ఆధ్వర్యంలో కార్యక్రమం సాగింది. కుంభ సంక్రమణం పర్వదినం సందర్భంగా సూర్య నమస్కారాలతోపాటు, సౌరహోమం నిర్వహించి, అనంతరం రాజశ్యామల హోమాన్ని చేపట్టారు. రామసేన వ్యవస్థాపకుడు శ్రీనివాసరావును పలువురు అభినందించారు. ఈకార్యక్రమంలో విశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేన సభ్యులు మామిడి అయ్యప్ప, తామర్ల రాంబాబు, ఇనగోటి బాపన్నదొర, వరసాల ప్రసాద్, వల్లూరి జగన్నాథశర్మ పాల్గొన్నారు.

రేపు జంగాలతోటలో వాలీబాల్ టోర్నమెంట్

వై.రామవరం,ఫిబ్రవరి 13: మండలంలో జంగాలతోట గ్రామంలో ఈనెల 15న వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు స్థానిక ఎస్ఐ సంతోష్‌కుమార్ తెలిపారు. పోలీస్‌శాఖ ఆదేశాలతో నిర్వహిస్తున్న ఈవాలీబాల్ టోర్నమెంట్‌కు అన్ని గ్రామాల నుంచి ఆసక్తిగల వాలీబాల్ టీమ్ తమ వివరాలు తెలియపరచాలని ఎస్ఐ సూచించారు. ప్రతీ జట్టుకు వాలీబాల్ కిట్, గెలుపొందిన టీమ్‌కు ప్రైజ్‌మనీ, భోజన సదుపాయం కల్పిస్తామని అలాగే ఆరోజున మెడికల్ క్యాంపు నిర్వహిస్తామన్నారు.

రైతులకు సత్వర సేవలు అందించేందుకే కంప్యూటరీకరణ

రంగంపేట, ఫిబ్రవరి 13: రైతులకు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం ద్వారా సత్వరసేవలు అందించేందుకే రైతులు, సంఘ సభ్యుల వివరాలను కంప్యూటరీకరణ చేస్తున్నామని జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ పర్యవేక్షకులు ఐ.జగన్నాధరావు చెప్పారు. మంగళవారం రంగంపేట ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం కార్యనిర్వాహణాధికారి బి.త్రిమూర్తులు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కంప్యూటరీకరణ పనులను ఆయన పరిశీలించి మాట్లాడారు. ఈ సంఘం పరిధిలో 10 గ్రామాల రైతులు సభ్యులుగా ఉన్నారని వారి సభ్యత్వానికి ఆధార్, పాన్, రేషన్‌కార్డు, ఓటర్‌గుర్తింపు కార్డు, ఫోటో, సెల్‌ఫోన్ నెంబర్,పొలంపాస్‌బుక్, జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ రంగంపేట ఖాతా, నామిని ఆధార్‌కార్డు జిరాక్స్‌తో లింకేజీ చేస్తున్నామని, ప్రతిచోటా రైతులు ఈ కార్యక్రమానికి సిబ్బందికి సహకరిం చాల్సిందిగా ఆయన కోరారు. ఈనెల 19 తేదీ లోగా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. సమావేశంలో సంఘ సిబ్బంది ప్రసాద్, గంగాధర్, రామకృష్ణా, శ్రీనివాసు, రాజు, ఈశ్వరరావు, బి.నాగు, మణికంఠ, రైతులు పాల్గొన్నారు.



రైతుల వివరాలు కంప్యూటరీకరణను పరిశీలిస్తున్న పర్యవేక్షకుడు జగన్నాధరావు

కోర్టు కానిస్టేబుల్ సతీష్ సేవలు అభినందనీయం

అనపర్తి, ఫిబ్రవరి 13 : కోర్టు కానిస్టేబుల్‌గా అనపర్తిలో ఐదేళ్లపాటు సేవలందించి కాకినాడ జిల్లాకు బదిలీపై వెళుతున్న సతీష్‌ను మంగళవారం అనపర్తి ఎస్ఐ రామారావు ఆధ్వర్యంలో పోలీసులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎస్ఐ రామారావు మాట్లాడుతూ కోర్టు పరిధిలోని వ్యవహారాలను చక్కబెట్టడంతో సతీష్ తనకు తానేచాటని అన్నారు. ముందుగా సతీష్‌ను ఎస్ఐ రామారావు ఆధ్వర్యంలో సిబ్బంది సత్కరించారు. ఈ కార్యక్రమంలో అనపర్తి పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.



కోర్టు కానిస్టేబుల్‌గా విధులు నిర్వహించి బదిలీపై వెళుతున్న సతీష్‌ను సత్కరిస్తున్న ఎస్ఐ రామారావు, సిబ్బంది

ఒత్తిడితో కాదు.. ఇష్టంతో చదవండి

● ప్రొఫెసర్ శ్రీనివాసరెడ్డి

బిక్కవోలు, ఫిబ్రవరి 13: ఒత్తిడికి గురికాకుండా ఇష్టంతో చదివితే మంచి మార్కులు సాధించవచ్చునని విశ్రాంత ప్రొఫెసర్ పడాల శ్రీనివాసరెడ్డి విద్యార్థులకు సూచించారు. పందలపాక ఉన్నత పాఠశాలలో మంగళవారం ఆయన పబ్లిక్ పరీక్షలకు హాజరుకానున్న పదో తరగతి విద్యార్థులకు మోటివేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన విద్యార్థులకు పరీక్షలకు ఏవిధంగా సిద్ధం కావాలి, ఏవిధంగా చదవాలి, మనస్సు శరీరాన్ని ఏవిధంగా అదుపులో ఉంచుకోవాలన్న విషయాలపై అవగాహన కల్పించారు. ఈయేడాది 160 మంది విద్యార్థులు తమ పాఠశాల నుంచి పదో తరగతి పరీక్షలకు హాజరవుతున్నారని హెచ్ఎం చిర్ల శ్రీనివాసరెడ్డి తెలిపారు. అనంతరం ఉపాధ్యాయులు ప్రొఫెసర్ శ్రీనివాసరెడ్డిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జయకృష్ణారెడ్డి, కేవీ కృష్ణారెడ్డి, యువరాజారెడ్డి, అంజనీకుమార్ పాల్గొన్నారు.



పందలపాకలో విశ్రాంత ప్రొఫెసర్ శ్రీనివాసరెడ్డిని సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

'దేశవ్యాప్త బంద్‌ను విజయవంతం చేద్దాం'

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 13: కేంద్రంలో మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న సామ్రాజ్యవాద, కార్పొరేట్ల అనుకూల విధానాలకు నిరసనగా రైతు సంఘాలు, కేంద్ర కార్మిక సంఘాల జేఏసీ ఇచ్చిన పిలుపుతో దేశవ్యాప్తంగా ఈనెల 16న నిర్వహిస్తున్న బంద్‌ను విజయవంతం చేద్దామని ఐఎఫ్‌టీయూ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు ఏవీ రమణ పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.

'ధ్యానంతో సృజనాత్మకతశక్తి పొందవచ్చు'

రాజమహేంద్రవరం, కల్చరల్ ఫిబ్రవరి 13: ధ్యానంతో సృజనాత్మకత శక్తి పొందవచ్చని కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్‌కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బళ్ళా శ్రీనివాసరావు అన్నారు. స్థానిక 3వ వార్డు నెహ్రూనగర్ మునిసిపల్ కార్పొరేషన్ హైస్కూల్ యోగా మాస్టర్ తీడా రాము ఆధ్వర్యంలో జరుగుతున్న యోగా తరగతుల్లో భాగంగా మంగళవారం ధ్యానం సహజయోగం ప్రక్రియలపై వివరణాత్మక తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ ధ్యానం ద్వారా అత్యధిక ఏకాగ్రత, సృజనాత్మకత శక్తి పొందవచ్చని దీని వల్ల పరీక్షల్లో ఒత్తిడి తగ్గి ప్రశాంతంగా పరీక్షలు రాయవచ్చని అన్నారు. హెచ్ఎం కేవీవీ సత్యనారాయణ, వ్యాయామోపాధ్యాయురాలు జి.సత్యవేణి, మాతాజీ నిర్మలాదేవి, సహజ రాజయోగ సాధన గురువులు, శిక్షకులు పాల్గొన్నారు.

జనసేన జిల్లా కోఆర్డినేటర్‌గా శివ



కడియం, ఫిబ్రవరి 13: జనసేన పార్టీ తూర్పుగోదావరి జిల్లా కోఆర్డినేటర్‌గా కడియం మండలం బుర్రిలంకకు చెందిన చిరంజీవి ఫాన్స్ సెక్రటరీ గెడ్డం శివరత్నగణపతి(శివ) నియమితులయ్యారు. తనకు జిల్లా కోఆర్డినేటర్ బాధ్యతలు అప్పగించిన జనసేన అధినేత పవన్‌కళ్యాణ్, నాదెండ్ల మనోహర్, జిల్లా అధ్యక్షుడు కందుల దుర్గేష్, బన్ని వాసు, వై.శ్రీనులకు కృతజ్ఞతలు తెలిపారు.

జేఈఈ మెయిన్స్‌లో విద్యార్థుల 'ప్రతిభ'



జెయియి మెయిన్స్‌లో సత్తా చాటిన ప్రతిభ విద్యార్థులు

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 13: జేఈఈ మెయిన్ పరీక్షా ఫలితాల్లో రాజమహేంద్రవరం దానవాయిపేట ప్రతిభ జూనియర్ కాలేజీ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించినట్టు కళాశాల చైర్మన్ ప్రతిభమూర్తి మంగళవారం తెలిపారు. కళాశాలలో టి.ప్రీతివర్ధన్ 99.86, జి.దుర్గా విఘ్నేష్, బి.శశిర 99.01 పర్సంటైల్ సాధించినట్టు చెప్పారు. అలాగే 50 మందికి పైగా విద్యార్థులకు అడ్వాన్సుడుకు అర్హత సాధించారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను చైర్మన్‌తోపాటు అకడమిక్ డైరెక్టర్ శ్రీకాంత్, ప్రిన్సిపల్ సాగర్ అభినందించారు.

శాస్త్రోక్తంగా విగ్రహ ప్రతిష్ఠాపన హోమం

● రుద్రాభిషేకం, ధాన్యాదివాసం



కోరుకొండ, ఫిబ్రవరి 13: కోరుకొండ మండలం జంబుపట్నం గ్రామంలో సుమారు రూ.80లక్షలతో నిర్మించిన శ్రీఉమా సమేత విశ్వేశ్వరస్వామి విగ్రహప్రతిష్ఠ మహోత్సవంలో భాగంగా మంగళవారం గణపతిపూజ, మండపములకు పునఃపూజ, హోమంలు, రుద్రాభిషేకం, యంత్ర జపములు, ధాన్యాదివాసము, పంచ సయ్యది వాసములు, దర్బారు సేవ, చతుర్వేద స్వస్తి కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ బ్రహ్మ మర్ల వెంకట గంగాధర్ సీతారామశాస్త్రి ఆధ్వర్యంలో 16 మంది ఆగమ వేదపండితులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. 18 మంది యజమాని దంపతులు పీఠలపై కూర్చుని హోమంలు చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో భారీ అన్న సమారాధన కార్యక్రమం జరిగింది. అలాగే నేడు విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహిస్తారు.


వైసీపీతోనే గ్రామాల అభివృద్ధి

అనపర్తి, ఫిబ్రవరి 13: వైసీపీ ప్రభుత్వంతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. మంగళవారం అనపర్తి గ్రామ పంచాయతీ పరిధిలోని పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపన కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ వారా కుమారి, ఉప సర్పంచ్ చిర్ల వీర్రాఘవరెడ్డి, నాయకులు నల్లమిల్లి మురళీమోహన బాలకృష్ణారెడ్డి, సత్తి రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్యసురక్ష

కడియం, ఫిబ్రవరి 13: కడియం మండలం పొట్టిలంక సచివాలయం-1 పరిధిలో డా. ఎస్.జెస్సీ సుప్రియ ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్యసురక్ష కార్యక్రమం జరిగింది. 454 మంది రోగులకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు.

రంగంపేట: మండలంలోని దొడ్డిగుంటలో జడ్పీ పాఠశాలలో గ్రామసర్పంచ్ కారి సంజీవరావు, వైద్యులు బి.వేణుశ్రీలక్ష్మీ, కె.చిన్నారావుల ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 478 మందిని పరీక్షించి అవసరమైన వారికి ఈసీజీ, రక్తపరీక్షలు నిర్వహించి రోగ నిర్ధారణ చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.







సర్కారుపై యుద్ధం చేద్దామని రాజమండ్రి నగర జేఏసీ నాయకుల అభివాదం

నేటి నుంచి ప్రభుత్వ ఉద్యోగుల ఆందోళన బాట

- ప్రభుత్వంపై యుద్ధానికి సిద్ధంకండి
- ఏపీ జేఏసీ ఉద్యమ బాట.. నల్లబ్యాడ్జీలతో నిరసన
- కలెక్టర్, సబ్-కలెక్టర్, తహశీల్దార్లకు వినతులు
- 27న ఛలో విజయవాడ..
- రాజమహేంద్రవరం జేఏసీ నేతల పిలుపు

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ ప్రభుత్వం ఉద్యోగులను మోసం చేసిందని..దీంతో ఆందోళనకు సమాయత్తమవ్వాలని రాజమహేంద్రవరం సిటీ జేఏసీ నేతలు పిలుపునిచ్చారు. స్థానిక ఏపీ ఎన్‌జీవో హోంలో మంగళవారం ఏపీ జేఏసీ నగర శాఖ విస్తృత సమావేశంలో పలువురు మాట్లాడారు. గత నాలుగున్నరేళ్లుగా ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లను మోసం చేసిన ప్రభుత్వానికి ఉద్యోగులతో పెట్టుకుంటే ఎలా ఉంటుందో చూపించాలన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు రాష్ట్ర ప్రభుత్వం సుమారు రూ.20 వేల కోట్లకు పైగా బకాయి ఉందన్నారు.చివరకు ఉద్యోగులు దాచుకున్న జీపీఎఫ్ ఏపీజీఎల్ఐ వంటి క్లెయిమ్‌లు కూడా ప్రభుత్వం చెల్లించడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. పదవీ విరమణ చెందిన వారి ప్రయోజనాలు చెల్లింపులో జాప్యం చేస్తుందన్నారు. ప్రతి నెల ఒకటో తేదీన పింఛన్లు, జీతాలు ఇవ్వడం లేదన్నారు. ఉద్యోగుల డిమాండ్లను పరిష్కరించని ఏ ప్రభుత్వము కూడా తిరిగి అధికారంలోకి రాలేదని హెచ్చరించారు. ఏపీ జేఏసీ పిలుపు మేరకు బుధవారం ఉద్యోగ, ఉపాధ్యాయులందరూ నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరవ్వాలని జేఏసీ అధ్యక్షుడు సుబ్బారావునాయుడు పిలుపు ఇచ్చారు. రాజమహేంద్రవరం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి వద్ద ఉదయం నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపి,ఆర్డీవోకు వినతిపత్రం అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నగర ఎన్‌జీవో సంఘం కార్యదర్శి ప్రవీణ్‌కుమార్, ఏజీ జేఏసీ కార్యదర్శి వేణుమాధవరావు, జిల్లా యూటీఎఫ్ అధ్యక్షుడు జయకర్, కార్యదర్శి షరీఫ్, ఎస్టీయు నాయకులు డేనియల్,పింఛన్‌దార్ల సంఘం నాయకులు కేజీకే మూర్తి, నాలుగోతరగతి ఉద్యోగుల సంఘం అధ్యక్ష కార్యదర్శులు వెంకటేశ్వరరావు, రమణ, నగర ఎన్జీవో సంఘ నాయకులు అనిల్‌కుమార్, ప్రతాప్, మాధవరావు, రాఘవరావు తదితరులు పాల్గొన్నారు.

4 రోజుల పాటు నిరసన


ఉద్యోగ,ఉపాధ్యాయ, కార్మిక, పెన్షన్‌దార్ల ఐక్య కార్యాచరణ (ఏపీ జేఏసీ) ఆధ్వర్యంలో తమ సమస్యల పరిష్కారానికి ఉద్యమ శంఖారావం పేరిట ఉద్యమబాట పట్టారు. ప్రభుత్వం చర్చలకు పిలిచి సరిగ్గా స్పందించకపోవడంతో ఉద్య మకార్యాచరణ వైపే జేఏసీ మొగ్గిన సంగతి తెలిసిందే.ఈ నేపథ్యంలో బుధవారం నుంచి వరుసగా నిరసన కార్య క్రమాలకు పిలుపునిచ్చారు. ఉద్యోగులందరూ బుధవారం నల్ల బ్యాడ్జీలు ధరించి తహశీల్దార్లు,సబ్- కలెక్టర్, కలెక్టర్‌కు మెమోరాండం సమర్పిస్తారు. 15న భోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జీలతో నిరసన తెలియజేస్తారు. 16న సభలు నిర్వహిస్తారు.17న ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ జిల్లా కేంద్రాల వద్ద, తాలూకా ఆఫీసుల వద్ద ర్యాలీలు, ధర్నాలు నిర్వహిస్తారు. 20న కలెక్టరేట్ వద్ద ర్యాలీ , ధర్నా నిర్వహిస్తారు. 27న ఛలో విజయవాడకు పిలుపునిచ్చారు.

నేటి నుంచి తంటికొండ వెంకన్న బ్రహ్మోత్సవాలు

గోకవరం, ఫిబ్రవరి13:గోకవరం మండలం తంటికొండలో శ్రీదేవి భూదేవి సమేత శ్రీవెంకటేశ్వరస్వామివారి 64వ దివ్య బ్రహ్మోత్సవాలు బుధవారం నుంచి 18వ తేదీ వరకు జరగనున్నాయి.ఈ మేరకు భక్తుల సౌకర్యార్థం సకల ఏర్పాట్లు చేసినట్టు దేవస్థానం చైర్మన్ బదిరెడ్డి రాంబాబు(రెడ్డియ్య), కార్యనిర్వహణాధికారి గండి వెంకటలక్ష్మీకుమార్ మంగళవారం తెలిపారు. బ్రహ్మోత్సవాలు ప్రారంభ రోజు బుధవారం ఉదయం ఆలయ ప్రదక్షిణ స్వస్తివాచనం, స్వామివారి పాదసేవ, హారతి, సంకల్పం, విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం,రిత్విక్ వరుణ, దీక్ష ధారణ, తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించనున్నారు.బ్రహ్మోత్సవాలు ఐదు రోజులు జరుగుతాయి. భక్తులు పెద్ద ఎత్తున హాజరై స్వామిని దర్శించుకోవాలని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేశామన్నారు.

రేపు జిల్లాస్థాయి ఇన్‌స్పైర్ ప్రదర్శన

రాజమహేంద్రవరంసిటీ, ఫిబ్రవరి 13: జిల్లాస్థాయి ఇన్‌స్పైర్ మనక్ ప్రదర్శనకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు రాజమహేంద్రవరం డివిజన్ ఉప విద్యాశాఖ అధికారి ఈవీబీఎస్ నారాయణ తెలిపారు. రాజమహేంద్రవరం లలితానగర్ సీజీటీఎం ఇంగ్లీష్ మీడియం స్కూల్ లో గురువారం ప్రదర్శనలు ఉంటాయని తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన పాఠశాలను పరిశీలించి ఏర్పాట్లు చూశారు.బుధవారం మధ్యాహ్నం 2గంటల నుంచి ఎంపికైన ప్రాజెక్టుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఉంటుందన్నారు. ఎంపికైనవారు తమ ప్రదర్శనలను తమకు కేటాయించిన రూమ్‌లో భద్రపరుచుకుని 15న ఉదయం 8:30 గంటలకు హాజరుకావాలన్నారు.



తెలి మంచు కురిసింది..

తెలిమంచు కురిసింది తలుపు తీయనా ప్రభూ.. ఇలగొంతు వొణికింది తలుపు తీయనా ప్రభూ.. ఈ పాటలాగే ప్రస్తుతం గ్రామాల్లో పరిస్థితి కనిపిస్తోంది.. నాలుగు రోజులుగా గ్రామాల్లో ఎడతెరిపి లేని మంచు కురుస్తోంది.. రాత్రి 11 గంటలకే మంచుదుప్పటి కప్పేస్తోంది.. ఉదయం 8 గంటలు దాటినా మంచు వీడడంలేదు.. తెల్లవారుజామున పొగమంచు దట్టంగా అలుముకుని ఉండడంతో వాహనాలు దగ్గరకు వచ్చే వరకు కూడా కనిపించని పరిస్థితి నెలకొంటుంది. ఉదయం 7.30 గంటలు దాటిన తరువాత భానుడు మెల్లమెల్లగా బయటకు వస్తున్నాడు.. 9 గంటలకు బయటపడు తున్నాడు..ఆ తరువాత నుంచి మండిపడుతున్నాడు.. ఈ సుందర దృశ్యాలు మంగళ వారం పెరవలి, తీపర్రు గోదావరి తీరాన కెమెరాకు చిక్కాయి.. - పెరవలి



ఓపీకి క్యూకట్టిన రోగులు.. సెల్‌ఫోన్లతో కుస్తీపడుతున్న నర్సులు

ఓపీ..వెతలు!

జిల్లా ఆసుపత్రిలో చీటీకి చింతే..

పేద రోగులతో ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది ఆటలాడుతున్నారు..స్మార్ట్ ఫోన్ ఉంటేనే వైద్యం లేదంటే నో చెబుతున్నారు.. దీంతో రోగులకు ఇక్కట్లు తప్పడం లేదు.. గతంలో ఎవరైనా రోగి ప్రభుత్వ ఆసుపత్రికి వస్తే ఓపీ రాసిచ్చేశారు.. వైద్యుడికి చూపించుకుని మందులు తీసుకునే వారు..ప్రస్తుతం చీటీ మాటేలేదు.. అంతా ఆన్ లైన్.. అదే రోగులకు ఇబ్బందిగా మారింది.. పాత పద్ధతినే కొనసాగించాలని ఆసుపత్రికి వచ్చే పేద రోగులు డిమాండ్ చేస్తున్నారు..

- పేదలకు వైద్యం అందని ద్రాక్షే
- ఓపీకే గంటల తరబడి నిరీక్షణ
- స్మార్ట్ ఫోన్ ఉంటేనే ఓపీ చీటీ
- ఇక్కట్లకు గురవుతున్న పేదలు
- స్మార్ట్ ఫోన్ తెలియక గగ్గోలు
- జీజీహెచ్‌కు తగ్గిన రోగులు



ఆన్‌లైన్ ఇలా చేయాలట

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 13 : రాజమహేంద్రవరం జీజీహెచ్ (ప్రభుత్వాసుపత్రి)లో రోగులకు అందే వైద్య సేవల మాటెలా ఉన్నా ఓపీ కష్టాలు మాత్రం తీరడంలేదు. ఓపీ (అవుట్‌పేషెంట్) విభాగంలో చీటీలు రాయించుకోవడానికి రోగులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం తొమ్మిదింటికే ఆసుపత్రికి వస్తున్నా ఓపీ చీటీ కోసం గంటల తరబడి వేచి చూడాల్సి వస్తోంది. ఏబీహెచ్‌ఏ యాప్ ద్వారా రోగుల వివరాలను మొబైల్ ఫోన్‌లో నమోదు చేయాల్సి రావడం, ఈ ప్రక్రియ పూర్తి చేయడానికి విపరీతమైన జాప్యం కారణంగా ఈ పరిస్థితి ఏర్పడుతోంది. సమయం అంతా ఓపీ చీటీలు రాయించుకోవడానికే సరిపోవడంతో డాక్టర్ దగ్గరకు వెళ్లేసరికి మరింత నీరసించిపోతున్నారు.ఈ కారణంగా ఓపీ చాలా వరకూ తగ్గుతున్నట్టు చెబుతున్నారు. సోమవారం ఓపీ కాస్త బాగుంటున్నా మిగిలిన రోజుల్లో బాగా తగ్గినట్టు తెలుస్తోంది. గతంలో సగటున వెయ్యి మందికి పైగా ఉన్న ఓపీ సంఖ్య ఇప్పుడు ఐదు, ఆరు వందలకు పడిపోయినట్టు చెబుతున్నారు. సదరం క్యాంపులు జరిగే మంగళ, శుక్రవారాల్లో ఓపీ సంఖ్య ఎక్కువగా కనిపిస్తున్నా వీళ్లలో చాలా మంది సదరం శిబిరాలకు వచ్చినవారే ఉన్నట్టు సమాచారం.

ఓపీ చీటీ కావాలంటే..

ఓపీ చీటీ కావాలంటే రోగి లేదా వారి సహాయకుల వద్ద తప్పనిసరిగా మొబైల్ ఫోన్ ఉండాలి. మొబైల్ ఫోన్‌కు వచ్చే ఓటీపీ నెంబరు చెబితేనే ఓపీ చీటీని జనరేట్ చేస్తారు. ముందుగా ఏబీహెచ్‌ఏ యాప్‌లో రోగికి సంబంధించిన ఆధార్ కార్డు నెంబరు, ఫోన్ నెంబరు, ఇంటి అడ్రస్ వంటి వివరాలన్నీ నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. ఆ తర్వాత యాప్‌లో లాగిన్ అయి, క్యూ ఆర్ కోడ్ ప్రక్రియ ద్వారా టోకెన్ నెంబరు పొందాల్సి ఉంటుంది. ఈ టోకెన్ నెంబరు చెబితేనే ఏబీహెచ్‌ఏ కౌంటర్ (ఓపీ కౌంటర్)లో కంప్యూటర్ ఓపీ చీటీ ఇస్తారు. ఇలా ఈ తతంగమంతా పూర్తి కావడానికి ఒక్కొక్కరికీ కనీసం 15 నుంచి 20 నిమిషాల సమయం పడుతుంది. అప్పటి వరకూ రోగి వేచి ఉండాల్సిందే. అయితే జీజీహెచ్ అధికారులు ఓపీ విభాగం వద్ద కొంత మంది సహాయకులను ఏర్పాటు చేసినా రోగులకు ఇక్కట్లు తప్పడంలేదు. స్మార్టుఫోన్‌లో ఏబీహెచ్‌ఏ యాప్ ద్వారా ఎవరికి వారే సొంతంగా టోకెన్ నెంబరు పొందవచ్చని ప్రభుత్వం చెబుతున్నా చాలామందికి దీనిపై అవగాహన లేకపోవడంతో ఆచరణలో ఇది సాధ్యం కావడంలేదు.

మొబైల్ ఫోన్ ఉండాల్సిందే..

స్మార్టు ఫోన్ లేని సాధారణ మొబైల్ ఫోన్ ఉన్న బాధితులు నేరుగా ఏబీహెచ్‌ఏ కౌంటర్‌లో సంప్రదించాలని అధికారులు చెబుతున్నా ఓపీ విభాగం సిబ్బంది రోగుల పట్ల నిర్లక్ష్యం చూపుతున్నారనే విమర్శలున్నాయి. సాధారణ మొబైల్ ఉన్నవారు ఏబీహెచ్‌ఏ కౌంటర్‌లో సంప్రదించాలని, ఎటువంటి ఫోన్ లేని వారు సాధారణ కౌంటర్‌లో టోకెన్ పొందాలని ఇస్తున్న ప్రకటనలు ఏ మాత్రం ఆచరణకు నోచుకోవడంలేదు. దీంతో ఓపీ రోగులకు ఇబ్బందులు తప్పడంలేదు. జీజీహెచ్ అధికారులు ఈ సమస్యపై దృష్టిసారించాలని ప్రజలు కోరుతున్నారు.

ఏఎస్పీ అనిల్‌కుమార్ బాధ్యతల స్వీకరణ



రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా శాంతి భద్రతల విభాగం అడిషనల్ ఎస్పీగా పి.అనిల్‌కుమార్ మంగళవారం బాధ్యతలు స్వీ కరించారు. అనంతరం ఎస్పీ జగదీశ్‌ని మర్యాదపూర్వ కం గా కలిసి మూడు సింహాల ప్రతిమను అందజేశారు. ఎస్పీ ఆయనకు పలు సూచనలు చేశారు.రానున్న ఎన్నికల నేప థ్యంలో శాంతి భద్రతల సమస్యలు తలెత్తకుండా ఇప్పటి నుంచే పటిష్ట మైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ప్రణాళికాబద్ధంగా పూర్తి సమన్వ యంతో ముందుకు వెళ్లాలని సూచించారు.ప్రజా భద్రత, రక్షణకు తొలి ప్రా ధాన్యం ఇవ్వాలన్నారు.2012 గ్రూప్-1 అధికారి అయిన అనిల్.. అనంతపురం,చింతపల్లి, విజయన గరంలో డీఎస్పీగా, డీజీపీ కార్యాలయంలో ఓఎస్‌డీగా పనిచేశారు. అడిషనల్ ఎస్పీగా ఉద్యోగోన్నతిపై గుంటూరు జిల్లాకు వెళ్లారు.తర్వాత అల్లూరి సీతారామరాజు జిల్లాలో అడిషనల్ ఎస్పీ(పరిపాలన)గా విధులు నిర్వర్తిస్తూ ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా జిల్లాకు వచ్చారు. ఆయనకు సమర్థవంతమైన అధికారిగా పేరుంది. అనిల్‌కి జిల్లాలోని డీఎస్పీలు, సీఐలు తదితరులు అభినందనలు తెలిపారు.



నల్లజర్ల మండలం ఆవపాడులో నిలిచిన డ్రైనేజీ నిర్మాణ పనులు

తవ్వారు..వదిలేశారు!

- గడప గడపకు పనుల్లోనూ వైసీపీ వర్గపోరు
- నిధులున్నా..ముందుకు సాగని డ్రైనేజీ నిర్మాణం
- లబోదిబోమంటున్న ఆవపాడు గ్రామస్తులు

నల్లజర్ల ,ఫిబ్రవరి 13 : ఎక్కడైనా నిధుల్లేక పనులు ఆగిపోతాయి. ఆ గ్రామంలో మాత్రం వైసీపీలోని రెండు వర్గాల మధ్య పోరు కారణంగా పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అయినా పట్టించుకునే వారే లేరు. గడప గడపకు కార్యక్రమంలో భాగంగా విడుదలైన రూ.20 లక్షల నిధులతో నల్లజర్ల మండలం ఆవపాడులో డ్రైనేజీ పనులు ప్రారంభించారు. వైసీపీ నాయకుడు ఆది తాతాజీ డ్రైనేజీ పనులు చేసేందుకు గోతులు తవ్వించారు.మరో వర్గం పనులు నిలిపివేయాలని అధికారులపై ఒత్తిడి తీసుకురావడంతో ఎక్కడి పనులు అక్కడే ఆగిపోయాయి. గత 15 రోజుల నుంచి ఇటు గుంతలు పూడ్చక.. మరో పక్క డ్రైనేజీ పనులు చేయకపోవడంతో గ్రామస్తులు గగ్గోలు పడుతున్నారు. తమ ఇళ్ల నుంచి బయటకు రావడం కష్టతరంగా ఉందని 15 కుటుంబాల వారు వాపోతున్నారు.బోదెలపై కర్రలు వేసుకుని వస్తున్నారు. రాత్రి సమయంలో అయితే బోదెలో పడిపోయే ప్రమాదం ఉందని గ్రామస్తులు చెబుతున్నారు.పనులు చేయకపోతే రూ.20 లక్షల నిధులు వెనక్కి వెళ్లిపోతాయని ఆవేదన చెందుతున్నారు.ఉన్నతాధికారులు ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరుతున్నారు.



గోకవరం హోటల్‌లో పడి ఉన్న బ్లేడ్ ముక్క

మళ్లీ బ్లేడ్‌బ్యాచ్‌ల.. కలకలం



ఇటీవల గోకవరం పోలీస్ స్టేషన్ పక్కన ఒక హోటల్‌లో బ్లేడ్‌తో జరిగిన దాడి..

- రెచ్చిపోతున్న రౌడీ మూకలు
- రాత్రయితే రోడ్లపై హల్‌చల్
- ఒంటరిగా కనిపిస్తే దోపిడీకి స్కెచ్
- నగరంలో 1300 మంది ఆవారాలు
- పీడీ కేసులో 400 మంది అరెస్టు
- బెయిల్‌పై వచ్చీ అదే పని
- కొరవడిన పర్యవేక్షణ
- చోద్యం చూస్తున్న పోలీసులు
- గోకవరంలో బ్లేడ్‌తో దాడి
- భయంభయంగా నగరవాసులు
- రాత్రయితే ఇళ్లకే పరిమితం

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

ఏరిపారేశాం.. భయం వద్దు.. ఇదీ పోలీసుల మాట. కానీ వాస్తవ పరిస్థితులు ఆ మాటలను సవాల్ చేస్తున్నాయి. ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో మరింత భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. జిల్లాలో మళ్లీ అల్లరి మూకల కదలికలు కనబడుతున్నాయి. చట్టాల గొడుగులో శాంతిగా భద్రంగా ఉన్నామనుకుంటున్న తరుణంలో ఆవారాగాళ్లు రెచ్చిపోతున్నారు. జైలు నుంచి బెయిల్‌పై విడుదలవుతున్న బ్లేడ్‌బ్యాచ్‌లపై పర్యవేక్షణ కొరవడిందనేఆరోపణలు సంఘటనలను నిజం చేస్తున్నాయి.

మళ్లీ బ్లేడ్ బ్యాచ్‌ల అలికిడి...

ఓ ఉద్యోగి పది రోజుల క్రితం రాత్రి 12 గంటల సమయంలో జాతీయ రహదారిపై వస్తున్నారు. ఆయనను జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ) పక్కన ఉన్న లీలాకృష్ణ టయోటా షోరూం వద్ద బైక్‌పై ఉన్న ఇద్దరు యువకులు లిఫ్ట్ కావాలంటూ వేలితో సింబల్ చూపించారు. ఈ సమయంలో సహాయం అవసరమని ఆయన ఆగారు. ఆ ఇద్దరిలో ఒకరు టార్చ్‌లైట్ వేసి ఆ వ్యక్తిని పరిశీలించాడు. 'వదిలేయ్ రా' అని చెప్పగానే.. 'పోరా' అని ఆ యువకుడు దురుసుగా చెప్పాడు. ప్రాణాలు దక్కాయంటూ ఆ వ్యక్తి వెళ్లిపోయాడు. ఆ వ్యక్తి మెడలో, చేతులకు ఏమైనా బంగారు వస్తువులు ఉన్నాయోమో అని యువకులు గమనించారు. ఏమీ లేకపోవడంతో వదిలేశారు. ఆ వ్యక్తి శరీరంపై ఏమైనా బంగారు వస్తువులు ఉంటే.. పరిస్థితి ఊహించుకోవడానికే భయంగా అనిపిస్తోందా!?. ఇది ఒక ఉదాహరణ మాత్రమే. గోకవరంలోని ఓ రెస్టారెంట్‌లో మరో ఘటన జరిగింది. బ్లేడ్‌బ్యాచ్‌గాళ్ల పని కాదని పోలీసులు మరుసటిరోజు చెప్పేశారు. కానీ బాధితుల ఒంటిపై గాయాలు, ఘటనా ప్రదేశంలో దొరికిన బ్లేడు ముక్కలు పోలీసుల మాటల్లో ఎంత వరకూ నిజం ఉందోననే అనుమానం కలిగిస్తున్నాయి.

సీసీ కెమెరాలు బొజ్జున్నాయా?

పెద్ద పెద్ద ఘటనల విషయంలో కేసులను పరిష్కరించిన చరిత్ర సీసీ కెమెరాలకు ఉంది. అయితే హైవేలో ఉన్న సీసీ కెమెరాలు ఎంత వరకూ పనిచేస్తున్నాయో తెలియని దుస్థితి ఉంది.ఈ క్రమంలో సిటీల్లో కెమెరాలపై పోలీసులు సీరియస్‌గా దృష్టి సారించాల్సిన అవసరం కనిపిస్తోంది. హైవేపై ఎన్‌హెచ్‌ఏఐతో పాటు పోలీసుల కెమెరాలు ఉన్నాయి. కానీ వాటి ఫుటేజీ విషయంలో అనుమానాలున్నాయి. కరెంటు లేని సమయంలో బ్యాటరీల సహాయంతో కెమెరాలు పనిచేసే ఏర్పాటు ఉండాలి. కానీ కరెంటు పోయిన సమయంలో కెమెరాలు ఎప్పుడు పనిచేస్తాయో తెలియడం లేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదులు వచ్చిన సందర్భంలో దర్యాప్తు తలనొప్పిగా మారుతోంది. హైవే పక్కన టయోటా షోరూం కొన్నాళ్ల కిందట మూసేశారు. రాత్రి సమయంలో ఆ ప్రాంతం భయానకంగా ఉంటుంది. ఇలాంటి వాటిపై పోలీసులు సీరియస్‌గా దృష్టి సారించాల్సిన అవసరత కనిపిస్తోంది.

రాజకీయ ఒత్తిళ్లు

బ్లేడ్‌బ్యాచ్, గంజాయి కేసుల్లో ఇప్పటికే 400 మంది వరకూ జైలులో ఉన్నారు. ఎస్పీ జగదీశ్ వచ్చిన తర్వాత ఉక్కుపాదంతో తొక్కేశారని చెబుతున్నారు. అయితే వాస్తవంలో ఆ పరిస్థితి కానరావడం లేదు. కేవలం రాజమహేంద్రవరంలోనే 1300 మంది వరకూ అలాంటి ఆవారాగాళ్లు ఉన్నట్టు సమాచారం. ధవళేశ్వరంలోనూ వీరికి తాకిడి ఎక్కువగా ఉంది.రాజకీయ ఒత్తిళ్లతో కొందరిపై ర్యలు తీసుకోలేపోతున్నారనే అపవాదు ఉంది. పోలీసులు పీడీ యాక్టు ప్రకారం కేసులు బనాయిస్తున్నా వారిలో బెదురు కానరావడం లేదు. అల్లరి మూకల లీడర్లు బయటే తిరుగుతున్నారని తెలుస్తోంది. వాళ్లపై ఎందుకు కఠిన చర్యలు తీసుకోవడం లేదో సామాన్యులకు అర్థం కావడం లేదు. ఒకవేళ అరెస్టు చేసి కోర్టు ఆదేశాలతో జైలుకు పంపిస్తున్నా బెయిల్ వచ్చే వాళ్లపై పర్యవేక్షణ కొరవడింది.దీంతో వాళ్లు రెచ్చిపోతున్నారు. వైసీపీ ప్రభుత్వంలో గంజాయి విచ్చలవిడిగా దొరుకుతుందనేది బహిరంగ రహస్యమే. మునుపటికంటే గంజాయి రవాణా, లభ్యత పెరిగినట్టు సమాచారం. గ్రామాల్లో కూడా దొరికేస్తోంది. దీంతో యువత పక్కదారి పడుతోంది. మత్తుకు అలవాటుపడి గంజాయి, మద్యం కొను గోలుకు నేరాల బాట పడుతున్నారు. పనీపాటా లేని యువకులు అర్ధరాత్రివేళ డబ్బుల కోసం వక్రమార్గాలు పడుతున్నారు.ఉపాధి లేక కోర్టులో కేసులు నడుస్తున్నా మళ్లీ నేరాలకు బరితెగిస్తున్నారని పెద్దలు చెబుతున్నారు. మళ్లీ బ్లేడ్ బ్యాచ్‌లపై పోలీసులు నిఘా పెట్టాల్సి ఉంది.

ఓటర్ల జాబితాను నిశితంగా పరిశీలించాలి

గోపాలపురం ఆర్వో శివజ్యోతి


రాజకీయ పార్టీల నాయకులతో సమావేశమైన ఆర్వో శివజ్యోతి

గోపాలపురం/దేవరపల్లి, ఫిబ్రవరి 13: ఓట్ల నమోదు, తొలగింపులు, బదిలీలపై వీఆర్వోలు నిశిత పరిశీలన చేయాలని ఆర్వో కేఎల్ శివజ్యోతి తెలిపారు. మంగళవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో మొదట రాజకీయ పార్టీల ప్రతినిధులు, అనంతరం బీఎల్‌వోలతో వేరువేరుగా సమావేశంలో ఆమె మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో ఓటర్ల జాబితాపై సమగ్ర విచారణ జరిపి సంబంధిత పత్రాలను అందుబాటులో ఉంచాలన్నారు. బీఎల్‌వోలు ఫామ్ 6, 7, 8 గురించి ఓటర్లకు అవగాహన కల్పించాలన్నారు. అనర్హులైన ఓటర్లను జాబితా నుంచి తొలగించా లన్నారు. విధి నిర్వహణలో రాజకీయ ఒత్తిళ్లను పక్కనపెట్టి సమగ్ర సర్వే జరిపి 18ఏళ్లు నిండిన యువతీయువకులను ఓటర్లుగా నమోదు చేయాలన్నారు. వీటితో పాటు ఇతర ప్రాంతాలకు, గ్రామాలకు వలస వెళ్లిన ఓటర్లను నియోజకవర్గాల బదిలీలపై దృష్టి పెట్టాలని ఆర్వో చెప్పారు. దేవరపల్లి మండల పరిషత్ కార్యాలయంలో బీఎల్‌వోలకు నిర్వహించిన అవగాహన సదస్సులో శివజ్యోతి మాట్లాడుతూ ఎన్నికలు దగ్గర పడనున్నందున ఎన్నికల నియామవళిని అందరూ తప్పనిసరిగా పాటించాలని, ఓటర్ల లిస్టులోని సమస్య లను పరిష్కరించాలని అన్నారు. ఎన్నికల సమయంలో పోలింగ్‌బూత్‌ల వద్ద అన్ని సౌకర్యాలు ఉండేలా చూడాలన్నారు. సదస్సులో ఎంపీడీవో కృష్ణంరాజు, డీటీ శ్రీనివాసరావు, ఆర్ఐ వెంకటేష్, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

సాయినాథ్ ఆలయంలో పూజలు


పూజలు చేస్తున్న ఆంధ్రా షుగర్స్ అధినేత నరేంద్రనాథ్‌చౌదరి

కొవ్వూరు, ఫిబ్రవరి 13: కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో శ్రీ సుందర సాయినాథ్ ఆలయంలో ఆంధ్రా షుగర్స్ సీఎండీ పెండ్యాల నరేంద్రనాథ్‌చౌదరి ప్రత్యేక పూజలు నిర్వహించారు.సాయినాథ్ ఆధ్యాత్మిక కేంద్రం నిర్వాహకుడు గుడివాక శ్రీని వాస్ ఆధ్వర్యంలో బాబా విగ్రహ ప్రతిష్టా వార్షికోత్సవాలు మంగళవారం ప్రారం భమయ్యాయి. కలశస్థాపన, సామూహిక శ్రీసాయి సచ్చరిత్ర పారాయణం, మహాగణపతి యాగం, గణపతి హోమం, హనుమాన్‌చాలీసా పారాయణం నిర్వహించారు. నరేంద్రనాద్‌చౌదరి బాబాను దర్శించుకున్నారు. ఆయనను ఆలయ పండితులు సత్కరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

విజయవాడ తరలిన బీజేపీ నాయకులు


విజయవాడ బయలుదేరిన బీజేపీ నాయకులు

కొవ్వూరు, ఫిబ్రవరి 13: రాష్ట్రంలో రైతుల ప్రయోజనాలను కాపాడాలని డిమాండ్ చేస్తూ విజయవాడలో జరుగుతున్న రైతు గర్జన బహిరంగ సభకు కొవ్వూరు నుంచి మంగళవారం బీజేపీ నాయకులు వెళ్లారు. బీజేపీ కిసాన్‌మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు పిక్కి నాగేంద్ర మాట్లాడుతూ రైతు ఆదాయం రెట్టింపు చేయాలనే లక్ష్యంతో ప్రధాని నరేంద్రమోదీ అనేక సంక్షేమ పథకాలు, ఎక్కువ సబ్సిడీతో తక్కువ రేట్లకు ఎరువులు, కిసాన్ క్రెడిట్ కార్డులు, కిసాన్ ఫసల్‌బీమా వంటి పథకాలను అమలుచేశారన్నారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సహకారానికి రాష్ట్ర ప్రభుత్వం మ్యాచింగ్ గ్రాంటు విడుదల చేయకపోవడంతో రైతులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. రైతు సమస్యలను పరిష్కరించి అన్నిరకాలుగా ఆదుకోవాలని లేకుంటే ఆందోళన చేపడతామన్నారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు పెరుగు పోతురాజు తదితరులు పాల్గొన్నారు.

తాళ్లపాలెంలో ఉచిత పశు వైద్య శిబిరం


తాళ్లపాలెంలో పశువైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ రామకృష్ణ

నిడదవోలు, ఫిబ్రవరి 13: మండలంలోని తాళ్లపాలెంలో రోటరీక్లబ్ ఆధ్వర్యంలో ఉప్పులూరి నరేష్ ఆర్థిక సహకారంతో ఉచిత పశువైద్య శిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. పశు సంవర్ధకశాఖ డిప్యూటీ డైరెక్టర్ జి.రాధాకృష్ణ మాట్లాడుతూ శిబిరంలో పశువులకు వైద్య సేవలతోపాటు ఉచితంగా మందులు అందిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా తాళ్లపాలెం, శింగవరం, శెట్టిపేట గ్రామాల్లోని 171 పాడి పశువులకు వైద్య సేవలందించి మందులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ యర్రా రామకృష్ణ, ఏడీ పి.రిషి ప్రసాద్, క్లబ్ అధ్యక్షుడు కీర్తి ఆంజనేయులు, పోలదాసు శ్రీనివాసరావు, యామన గోపాలకృష్ణ, గొన్నాబత్తుల రామారావు, గోపిరెడ్డి శ్రీనివాస్, గుంటుపల్లి శివకుమార్ పాల్గొన్నారు.

నేడు కాంగ్రెస్ ఉభయ గోదావరి జిల్లాల సమీక్ష

పార్టీ జిల్లా అధ్యక్షురాలు అరిగెల అరుణకుమారి



పెరవలి, ఫిబ్రవరి 13: ఉభయ గోదావరి జిల్లాల కాంగ్రెస్ పార్టీ నాయకుల సమీక్షా సమావేశం ఈ నెల 14న ఉదయం రాజమహేంద్రవరంలో నిర్వహిస్తున్నట్టు పార్టీ తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షురాలు అరిగెల అరుణకుమారి తెలిపారు. రాజమహేంద్రవరం పేపర్ మిల్లు గేటు వద్ద ఉన్న సాయి కల్యాణ మండపంలోని జరిగే ఈ సమావేశానికి కాంగ్రెస్ పార్టీ ఏపీ వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్యం ఠాగూర్, కొప్పుల రాజు, ఏఐసీసీ సెక్రటరీ మయ్యప్పన్, సీడబ్ల్యూసీ సభ్యుడు గిడుగు రుద్రరాజు, ఉభయగోదావరి జిల్లా పార్టీ పర్యవేక్షకురాలు సుంకర పద్మశ్రీ హాజరవుతారన్నారు. జిల్లాలోని నగర, పట్టణ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, యూత్ కాంగ్రెస్ మహిళా విభాగం, కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంస్థల అధ్యక్షులు, సోషల్ మీడియా కోఆర్డినేటర్స్ హాజరు కావాలని తెలిపారు.

ఆగి ఉన్న టిప్పర్‌ను ఢీకొన్న బస్సు


ప్రమాదంలో ధ్వంసమైన ట్రావెల్‌బస్సు

నల్లజర్ల, ఫిబ్రవరి 13: ఆగి ఉన్న టిప్పర్‌ను ట్రావెల్ బస్సు ఢీకొనడంతో బస్సు డ్రైవర్‌కు, ఓ ప్రయాణికుడికి స్వల్పగాయాలయ్యాయి. మండలంలోని అచ్చన్నపాలెం బస్సు షెల్టర్ వద్ద ఆగి ఉన్న టిప్పర్‌ను మంగళవారం తెల్లవారుజామున పార్వతీపురం నుంచి విజయవాడ వెళుతున్న సాయి ఆర్‌కే ట్రావెల్ బస్సు వెనుక నుంచి వేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బస్సు డ్రైవర్ సూర్యకుమార్‌కు చెయ్యి విరిపోగా ప్రయాణికుడు విజయవాడకు చెందిన అనుపోజు వెంకటరత్నం నుదుటిపై గాయమైంది. ఇద్దరినీ అంబులెన్స్‌లో ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఒత్తిడితో కాదు.. ఇష్టంతో చదవండి

బిక్కవోలు, ఫిబ్రవరి 13: ఒత్తిడికి గురి కాకుండా ఇష్టంతో చదివితే మంచి మార్కులు సాధించవచ్చునని విశ్రాంత ప్రొఫెసర్ పడాల శ్రీనివాసరెడ్డి విద్యార్థులకు సూచించారు. పందలపాక ఉన్నత పాఠశాలలో మంగళవారం ఆయన పబ్లిక్ పరీక్షలకు హాజరుకానున్న పదో తరగతి విద్యార్థులకు మోటివేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు పరీక్షలకు ఏవిధంగా సిద్ధ కావాలో, ఏవిధంగా చదవాలో, మనస్సు శరీరాన్ని ఏవిధంగా అదుపులో వుంచుకోవాలో అవగాహన కల్పించారు. ఈ ఏడాది 160 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు హాజరవుతున్నారని హెచ్‌ఎం చిర్ల శ్రీనివాసరెడ్డి తెలిపారు.

రెండో..సారీ!

- ఇందిరమ్మ కాలనీకి నిర్మితమవ్వని అప్రోచ్ రోడ్డు
- రెండోసారి శిలాఫలకం ఆవిష్కరించిన తలారి

చాగల్లు, ఫిబ్రవరి 13: స్థానిక ఇందిరమ్మ కాలనీ ఏర్పడి సుమారు 18 ఏళ్లు అవుతోంది. నేటికీ కాలనీకి వెళ్లే అప్రోచ్ రోడ్డు నిర్మాణం జరగలేదు. గోతులు, గొప్పులతో కచ్చా రోడ్డులాగా ఉంటుంది. కాలనీ వాసులు.. ఎందరినో కలిసి ఎన్ని విన్నపాలు చేసినప్పటికీ నిర్మాణం పూర్తికాలేదు. 2018లో సాధారణ ఎన్నికలకు ముందు మంత్రి హోదాలో నారా లోకేశ్ పీఆర్ నిధులు రూ.1.55 కోట్ల వ్యయంతో నిర్మాణానికి శిలాఫలకం ఆవిష్కరించారు. కాని అనంతరం వచ్చిన వైసీపీ ప్రభుత్వం రోడ్డు నిర్మాణానికి ఎటువంటి చర్యలు తీసుకోలేదు. కాగా తాజాగా ఇందిరమ్మ కాలనీకి వెళ్లే అప్రోచ్ రోడ్డు నిర్మాణానికి వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తలారి వెంకటరావు మంగళవారం శిలాఫలకం ఆవిష్కరించారు. డీఎంఎఫ్ నిధులు రూ.1.25 కోట్ల వ్యయంతో నిర్మించనున్నారు. ఎన్నికల సమయంలో శిలాఫలకాలు ఆవిష్కరించడం తరువాత పట్టించుకోకపోవడం సర్వసాధారణమైపోయిందని, శిలాఫలకాల ఆవిష్కరణలతో ఉపయోగం లేదని, రోడ్డు నిర్మాణం చేయాలని కాలనీ వాసులు కోరుతున్నారు.


అప్రోచ్ రోడ్డు నిర్మాణానికి శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే తలారి

బ్రాహ్మణుల సంక్షేమానికి టీడీపీ-జనసేన పెద్దపీట

బ్రాహ్మణ ఆత్మీయ సమావేశంలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేమూరి


సమావేశంలో మాట్లాడుతున్న వేమూరి ఆనంద్ సూర్య

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 13: బ్రాహ్మణ సంక్షేమానికి టీడీపీ, జనసేన పార్టీలు పెద్దపీట వేయనున్నాయని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేమూరి ఆనంద్‌సూర్య అన్నారు. రాజమహేంద్రవరం హోటల్ జగదీశ్వరీలో మంగళవారం జరిగిన టీడీపీ-జనసేన బ్రాహ్మణుల ఆత్మీయ సమావేశానికి ఆయనతోపాటు మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆదిరెడ్డి శ్రీనివాస్, జనసేన సిటీ ఇన్‌చార్జి అనుశ్రీ సత్యనారాయణ, నగర అధ్యక్షుడు వై శ్రీను, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ యనమండ్ర సాయిసురేష్ ముఖ్యఅతిథులుగా విచ్చేసి మాట్లాడారు. తెలుగుదేశం ప్రభుత్వంలో బ్రాహ్మణుల సంక్షేమానికి అనేక అభివృద్ధి పథకాలు అమలు చేసిందని, అయితే ప్రస్తుత ప్రభుత్వం ప్రతి పథకాన్ని నిర్వీర్యం చేసిందన్నారు. టీడీపీ-జనసేన కూటమి అధికారంలోకి వస్తే బ్రాహ్మణుల ఆర్థిక, రాజకీయ, సామాజిక అభివృద్ధికి సహకరిస్తుందన్నారు. సమావేశంలో టీడీపీ నగర అధ్యక్షుడు రెడ్డి మణి, ముత్యా సత్తిబాబు, భమిడిపల్లి బాబు, నిమిషకవి వెంకటేష్, కోలగంటి రమేష్, భాగవతుల అయ్యప్ప, మజ్జి రాంబాబు, యిన్నమూరి రాంబాబు, మిస్కా జోగినాయుడు, బ్రాహ్మణ ప్రముఖులు, రాష్ట్రీయ బ్రాహ్మణ సంఘటన్ నాయకులు పాల్గొన్నారు.

రెయిలింగ్‌ను ఢీకొన్న బైక్

సీఐఎస్ఎఫ్ కానిస్టేబుల్ మృతి


ప్రమాదంలో మృతిచెందిన శిరీష్‌కుమార్

కొవ్వూరు, ఫిబ్రవరి 13: కొవ్వూరు రోడ్డు కం రైలు బ్రిడ్జిపై జరిగిన ప్రమాదంలో సీఐఎస్ఎఫ్ కానిస్టేబుల్ మృతిచెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. చాగల్లు మండలం మల్లవరం గ్రామానికి చెందిన జలాది శిరీష్‌కుమార్ (35) సీఐఎస్ఎఫ్ కానిస్టేబుల్. మూడు రోజుల క్రితం బంధువులను పరామర్శించడానికి ఇంటికి వచ్చాడు. ఈ నెల 12న ధవళేశ్వరం బంధువుల ఇంటికి వెళ్లి పని ముగించుకుని తిరిగి పల్సర్ బైక్‌పై ఇంటికి బయలుదేరాడు. మంగళవారం తెల్లవారుజామున 2గంటల సమయంలో మార్గమధ్యంలో రోడ్డు కం రైలు బ్రిడ్జిపై కొవ్వూరు వైపు వస్తుండగా బైక్ అదుపుతప్పి రెయిలింగ్‌ను ఢీకొట్టింది. దీంతో బైక్ పైనుంచి కింద పడిపోయిన శిరీష్‌కుమార్ తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పట్టణ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. శిరీష్‌కుమార్‌కు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉండగా ఆమె ప్రస్తుతం మూడు నెలల గర్భిణి. ఈ ప్రమాదంతో మల్లవరంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ కె.జగన్మోహనరావు తెలిపారు.

కుటుంబం పెద్దదిక్కును కోల్పోయింది


శిరీష్‌కుమార్(ఫైల్)

చాగల్లు, ఫిబ్రవరి 13: సీఆర్‌పీఎఫ్ కానిస్టేబుల్ జాలాది శిరీష్‌కుమార్ మృతితో మండలంలోని మల్లవరం గ్రామంలో విషాదం నెలకొంది. శిరీష్ తండ్రి చిన్నతనంలో చనిపోగా తల్లి వీరమ్మ కూలిపని చేసుకుంటూ కొడుకును ఉన్నత చదువులు చదివించుకుంది. ఉద్యోగం వచ్చి ఐదు సంవత్సరాలు అవుతుండగా అతనికి నాలుగేళ్ల కిందట వివాహం జరిగింది. వారికి ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. కుటుంబం ఆనందంగా ఉంటున్న వేళ ప్రమాదంలో అతను చనిపోవడంతో కుటుంబం పెద్ద దిక్కును కోల్పోయినట్టయింది. దీంతో కుటుంబ సభ్యులు, బంధు మిత్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

జేఈఈ మెయిన్స్‌లో 'శశి'కి అత్యుత్తమ ఫలితాలు


విద్యార్థిని అభినందిస్తున్న శశి విద్యాసంస్థల ఛైర్మన్ రవికుమార్

ఉండ్రాజవరం, ఫిబ్రవరి 13: కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన జేఈఈ మెయిన్స్-2024 ఫలితాల్లో తమ విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించినట్టు వేలివెన్ను శశి విద్యాసంస్థల ఛైర్మన్ బూరుగుపల్లి రవికుమార్ మంగళవారం తెలిపారు. తమ విద్యార్థులు జె.శ్రీహర్షిత 99.92 పర్సంటైల్, సీహెచ్ పురందరిసత్య 99.91, ఎస్.నాగేశ్వర విశ్వాంత్ 99.89, పి.నితీష్‌శ్రీసత్య 99.88, ఎల్.ఉదయకిరణ్, 99.87, బి.గరిమ 99.85, ఎస్.లక్ష్మి నిష్కల్ 99.82, కేపీటీఎన్ వంశీకృష్ణ, 99.80, ఏవైకె కుమార్ 99.78, బి.పవన్ 99.76, డీఐ చంద్ర 99.75, ఎ.అశితేష్ 99.72, కేఎస్ పవన్ 99.71, పి.నిఖిల 99.71, కేడీకే లక్ష్మణ్ 99.62, బి.పురంధర్ 99.55, ఎంపీ రెడ్డి 99.52, జీఎంఆర్ రెడ్డి 99.51 పర్సంటైల్ సాధించినట్టు తెలిపారు. వీరితోపాటు 221మంది విద్యార్థులు 90 పర్సంటైల్ పైగా సాధించినట్టు తెలిపారు. ప్రతిభ కనపర్చిన విద్యార్థులను, అధ్యాపక బృందాన్ని ఛైర్మన్ రవికుమార్‌తోపాటు వైస్‌ఛైర్మన్ లక్ష్మీసుప్రియ అభినందించారు.

రైతు సంక్షేమానికి రైతు భరోసా కేంద్రాలు

ఉండ్రాజవరం, ఫిబ్రవరి 13: రైతులు సంక్షేమానికి రైతు భరోసాకేంద్రాలు పనిచేస్తున్నట్లు ఎమ్మెల్యే జి.శ్రీనివాసనాయుడు పేర్కొన్నారు. మంగళవారం మోర్త గ్రామంలో నూతనంగా నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని ఎమ్మెల్యే శ్రీనివాసనాయుడు ప్రారంభించి మాట్లాడారు. రైతు భరోసా కేంద్రాల వద్ద రైతులకు పంటల గురించి సమాచారం అందిస్తున్నారన్నారు. గ్రామంలో సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేశారు. అనంతరం మోర్త, సూర్యారావుపాలెం, తాడిపర్రు హైస్కూలు విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ పాలాటి యల్లారీశ్వరి, సొసైటీ అధ్యక్షుడు ఆలపాటి నరేంద్రప్రసాద్, నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

భారత్ బంద్ విజయవంతం చేయండి

గోపాలపురం, ఫిబ్రవరి 13: అఖిల భారత రైతు కూలి సంఘం(ఏఐకేఎంఎస్) ఆధ్వర్యంలో ఈ నెల 16న జరిగే గ్రామీణ భారత్ బంద్‌ను, పారిశ్రామిక సమ్మెను విజయవంతం చేయాలని ఏఐకేఎంఎస్ జిల్లా సహాయ కార్యదర్శి పోరండ్ల శ్రీనివాస్ ఓ ప్రకటనలో తెలిపారు. రైతు వ్యతిరేక మూడు నల్ల చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఏడాదికి పైగా రైతులు కొనసాగించిన ఉద్యమం ఫలితంగా మోదీ ప్రభుత్వం దిగొచ్చి ఆ చట్టాలను రద్దు చేసినట్టు ప్రకటించిందన్నారు. రైతు సమస్యలు, పంటల గిట్టుబాటు ధరల చట్టంపై కనీసం దృష్టిపెట్టలేదన్నారు. రాతపూర్వకంగా ఇచ్చిన హామీలను రెండేళ్లు దాటినా అమలు చేయలేదని మండిపడ్డారు. అనేక పోరాటాల ఫలితంగా కార్మికులు సాధించుకున్న 44 లేబర్ చట్టాలను కుదించి నాలుగు లేబర్‌కోడ్‌లు తీసుకొచ్చి కార్మిక హక్కులను కాలరాసేందుకు కేంద్ర ప్రభుత్వం పూనుకుందన్నారు. ఈ సమస్యల పరిష్కారం కోరుతూ చేపట్టిన సమ్మెను విజయవంతం చేసి కేంద్రానికి రైతాంగ, కార్మికుల సమస్యలు తెలపాలన్నారు.

సరోజనీనాయుడు జయంతి


రాగోలపల్లి స్కూల్లో సరోజనీనాయుడు జయంతి నిర్వహిస్తున్న దృశ్యం

తాళ్లపూడి, ఫిబ్రవరి 13: మండలంలోని రాగోలపల్లి ప్రాథమిక పాఠశాలలో సరోజనీనాయుడు జయంతిని మంగళవార నిర్వహించారు. హెచ్‌ఎం మాట్లాడుతూ హైదరాబాదులోని బెంగాలీ కుటుంబంలో జన్మించిన సరోజనీ నాయుడు మద్రాసు, లండన్ చదువుకున్నారని, భారతదేశ స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొని మహాత్మా గాంధీ అడుగుజాడల్లో పయనించారని, జాతీయ కాంగ్రెస్ అధ్యక్షురాలిగా పనిచేశారన్నారు. కవిగా ఆమె కృషికి గాంధీజీ నైటింగేల్ ఆఫ్ ఇండియా అని పిలిచారని చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

చాగల్లు, ఫిబ్రవరి 13: చాగల్లులోని టీటీడీ కల్యాణ మండపంలో మండల స్థాయి అభివృద్ధి పనులపై మంగళవారం సమీక్ష సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, ఎమ్మెల్యే తలారి వెంకటరావు పాల్గొని సమీక్ష నిర్వహించారు. అధికారులు, ప్రజాప్రతినిధులకు సహకరించి అభివృద్ధి పనులు వేగంగా జరగడానికి కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

మార్చి 9న మెగా లోక్ అదాలత్

నిడదవోలు, ఫిబ్రవరి 13: నిడదవోలులోని జూనియర్ సివిల్ కోర్టు ఆవరణలో మార్చి 9న మెగా లోక్ అదాలత్ నిర్వహిస్తున్నామని జడ్జి జి.రామకృష్ణ తెలిపారు. ఈ అదాలత్‌లో రాజీ పడదగిన సివిల్, క్రిమినల్, ప్రీ లిటిగేషన్, బ్యాంకు, రెవెన్యూ, ఎలక్ట్రిసిటీ, మనోవర్తి కేసులు పరిష్కరించుకోవచ్చని తెలిపారు.

నిడదవోలులో ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీ

నిడదవోలు, ఫిబ్రవరి 13: అర్హులైన ప్రతిఒక్కరికి ఆరోగ్యశ్రీ కార్డులు అందిస్తున్నామని మున్సిపల్ వైస్ ఛైర్మన్ గంగుల వెంకటలక్ష్మి అన్నారు. మంగళవారం నిడదవోలులోని 4వ వార్డులో ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీ చేశారు. ఈ కార్డుల ద్వారా రూ.5లక్షల నుంచి 25 లక్షల వరకు వైద్య సేవలు పొందవచ్చని ఆమె చెప్పారు. కార్యక్రమంలో బీసీ సెల్ సెక్రటరీ గంగుల గోపీయాదవ్, జి.దేవి తదితర్లు పాల్గొన్నారు.

యోగి వేమన ప్రజాకవి

దేవరపల్లి, ఫిబ్రవరి 13: యోగి వేమన ప్రజాకవి, సంఘ సంస్కర్త అని, వేమన పద్యం విననివి తెలుగు వారుండరని మానవత సంస్థ మండలాధ్యక్షుడు పప్పు వెంకటరామారావు అన్నారు. మండలంలోని పల్లంట్లలో మంగళవారం జరిగిన వేమన జయంతి ఉత్సవాల్లో భాగంగా వేమన విగ్రహానికి ఆయన పూలమాలలతో నివాళులర్పించారు. యోగి వేమన ఫౌండేషన్ నాయకుడు కూచిపూడి సత్యనారాయణ మాట్లాడుతూ వేమన పద్యాలు మన జీవితాన్ని ఆలోచింపజేసే విధంగా ఉంటాయని, వేమనను అందరూ స్మరించుకోవాలన్నారు. కార్యక్రమంలో బలుసు సత్యనారాయణ, ఉండవల్లి కృష్ణారావు, ఆచంట సుభాష్‌చంద్రబోస్, కేవీవీ సత్యనారాయణ, రామారావు, కూచిపూడి హనుమంతరావు పాల్గొన్నారు.

ముంపు ప్రాంతాల్లో ఇళ్ల స్థలాలిచ్చారు

- ఊరికి దూరంగా ఉన్నాయి.. సమస్యను పరిష్కరించండి
- గోపాలపురం వైసీపీ ఇన్‌చార్జి వనితకు ధుమంతునిగూడెం వాసి వినతి

దేవరపల్లి, ఫిబ్రవరి 13:ధుమంతునిగూడెం పంచాయతీ పరిధిలోని ధుమంతునిగూడెం, సుబ్బరాయపురంలో శ్మశానవాటికకు స్థలం కావాలని, పాత మంచినీటి ట్యాంకు స్థానంలో కొత్తది నిర్మించాలని, ఇళ్ల స్థలాలు ఊరికి దూరంగా మార్గంలేని చోట ముంపుకు గురయ్యే ప్రాంతంలో ఇచ్చారని స్థలాల సమస్య పరిష్కరించాలని స్థానికుడు గారపాటి రాజ్‌కుమార్ హోం మంత్రి తానేటి వనితకు విన్నవించాడు. గౌరీపట్నం, పల్లంట్ల, కురుకూరు, కృష్ణంపాలెం, ధుమంతుని గూడెం, బందపురం గ్రామాల్లో వైసీపీ నాయకులు, కార్యకర్తలు, వలంటీర్లు ఆత్మీయ సమావేశాలు మంగళవారం వైసీపీ మండలాధ్యక్షుడు కూచిపూడి సతీష్ అధ్యక్షతన జరిగాయి. ఉదయం గౌరీపట్నంలోని దుర్గాదేవి ఆలయంలో మంత్రి తానేటి వనిత ప్రత్యేక పూజలు చేశారు. నిర్మలగిరి పుణ్యక్షేత్రంలో మేరీమాతను దర్శించుకుని ప్రార్థనలు చేశారు. ధుమంతునిగూడెం సదస్సులో ఆమె మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం నూరుశాతం సంక్షేమ పథకాలు అమలు చేసిందన్నారు. ప్ర భుత్వం అందించే సంక్షేమ పథకాలు వలంటీర్లు తెలియజేయాలన్నారు. గ్రామ సచివాలయ అధికారులు సంక్షేమ పథకాలు అందేలా చూడాలన్నారు. వైసీపీ ప్రభుత్వం విద్యారంగానికి పెద్దపీట వేసిందన్నారు. సకాలంలో ధాన్యం కొనుగోలు చేసి రైతులను ఆదుకుందన్నారు. పవన్‌కల్యాణ్ తాను ముఖ్యమంత్రి కావాలని అనుకోవడం లేదని జగన్‌ను దింపి చంద్రబాబును ముఖ్యమంత్రి చేయాలని అనుకుంటున్నారని విమర్శించారు. గ్రామస్థులను విన్న మంత్రి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమాల్లో ఏఎంసీ ఛైర్మన్ గన్నమని జనార్దనరావు, ఎంపీపీ దుర్గారావు, ఎంపీ అభ్యర్థి గుడూరి శ్రీనివాసరావు సతీమణి గూడూరి రాధిక, సర్పంచ్‌లు నూతలపాటి వెంకటరమణ, శ్రీరంగం రామలక్ష్మి, ఎంపీటీసీలు సత్తి జగదీశ్వర్‌రెడ్డి, వైఎస్ ఎంపీపీ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.


ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి వనిత

పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలను పర్యవేక్షించాలి

- మునిసిపల్ కమిషనర్ దినేష్‌కుమార్
- రాజమహేంద్రవరంలో పోలింగ్ స్టేషన్ల పరిశీలన

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 13: బూత్ లెవెల్ అధికారులు తమ పరిధిలోని పోలింగ్ కేంద్రాల్లో ప్రాథమిక సౌకర్యాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కమిషనర్ దినేష్‌కుమార్ ఆదేశించారు. మంగళవారం ఆయన నగరంలోని జైల్ వార్డర్ లైన్స్ మునిసిపల్ కార్పొరేషన్ ప్రాథమిక పాఠశాల, క్వారీపేట మునిసిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల, సిద్ధార్థ నగర్ మునిసిపల్ కార్పొరేషన్ ప్రాథమిక పాఠశాల టౌన్ హైస్కూల్, బత్తుల మల్లిఖార్జునరావు మునిసిపల్ కార్పొరేషన్ ప్రాథమిక పాఠశాల, కంటిపూడి రామారావు కార్పొరేషన్ హైస్కూల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను ఆయన బూత్‌లెవెల్ అధికారులు, సూపర్‌వైజర్లు, సెక్టారు అధికారులు, ఇంజనీరింగ్ అధికారులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ బీఎల్‌వోలు కొత్తగా నమో దైన ఓటర్లను కూడా కలుపుకొని తమ పోలింగ్‌కేంద్రాల్లో ఓటర్లు 1400 మంది కన్నా ఎక్కువ ఉంటే ఎక్సిలరీ పోలింగ్ స్టేషన్ ఏర్పాటు చేసేందుకు ఉన్న అవకాశాలను పరిశీలించి సెక్టారు అధికారి ద్వారా నివేదిక ఇవ్వాలన్నారు. బీ ఎల్‌వోలు తమ పరిధిలో ఎంత మందికి హోమ్ ఓటింగు సౌకర్యం కల్పించారో లెక్కతేల్చాలని, ఓటరు అంగీకారంతోనే హోమ్ ఓటింగు సిఫార్సు చేయాలని ఆదేశించారు. పాఠశాలల్లో నెలకొల్పిన పోలింగ్ కేంద్రాలను పరిశీలించే సమయంలో అక్కడ ఉన్న విద్యార్థులతో స్కూల్లో వున్న సౌకర్యాలపై ఆరా తీశారు. మధ్యాహ్నభోజన పథకం అమలుతీరును పరిశీలించారు. కార్యక్రమంలో ఈఈ ఆర్‌వీఎస్ శేషగిరిరావు, ఎలక్షన్ డీటీ పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

డ్రైవింగ్‌లో నిర్లక్ష్యం వద్దు

డీఎల్ఎస్ఏ కార్యదర్శి ప్రత్యూషకుమారి



సదస్సులో ప్రసంగిస్తున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి ప్రత్యూషకుమారి

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): వాహనాలను డ్రైవింగ్ చేసే సమయంలో ప్రతి నిమిషం అప్రమత్తంగా ఉండాలని.. చిన్నపాటి నిర్లక్ష్యం కూడా కుటుంబాల్లో పెను విషాదానికి దారితీస్తుందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రత్యూష కుమారి పేర్కొన్నారు. డ్రైవింగ్ లైసెన్సులు, రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ల జారీకి సంబంధించి సమస్యల పరిష్కారం, రోడ్డు ప్రమాదాల నివారణపై సంస్థ కార్యాలయంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యూష మాట్లాడుతూ మద్యం లేదా ఇతర మత్తు పదార్థాలు తాగి వాహనాలు నడపరాదన్నారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరంగా కఠిన చర్యలు ఉన్నాయన్నారు. వాహనాలు నడిపేవాళ్లు కొందరు బాధ్యతాయుతంగా లేకపోవడం వల్ల ప్రమాదాలు జరిగి ఎన్నో జీవితాలు తీవ్ర ఇబ్బందుల్లో పడుతున్నాయని గుర్తెరగాలన్నారు. నిర్దేశిత వేగంతో డ్రైవ్ చేస్తూ రోడ్డు భద్రతా నిబంధనలను పాటిస్తే రోడ్డు ప్రమాదాలను చాలా వరకూ తగ్గించవచ్చన్నారు. మోటారు వాహనాల చట్టం-1988, మోటారు వాహనాల సవరణ చట్టం-2019లోని అంశాలను వివరించారు. కార్యక్రమంలో ఎంవీఐ సంపత్‌కుమార్, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ విలియం కేరీ, ట్రాఫిక్ సీఐ బాల మురళీకృష్ణ, మెప్మా కార్యకర్తలు, వార్డు వలంటీర్లు, ఆటోడ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

ధ్యానంతో సృజనాత్మక శక్తి పెంపు

రాజమహేంద్రవరం, కల్చరల్ ఫిబ్రవరి 13: ధ్యానంతో సృజనాత్మకత శక్తి పొందవచ్చని కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్‌కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బళ్ళా శ్రీనివాసరావు అన్నారు. స్థానిక 3వ వార్డు నెహ్రూనగర్ మునిసిపల్ కార్పొరేషన్ హైస్కూల్ యోగా మాస్టర్ తీడా రాము ఆధ్వర్యంలో జరుగుతున్న యోగా తరగతుల్లో భాగంగా మంగళవారం ధ్యానం సహజయోగం ప్రక్రియలపై వివరణాత్మక తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ ధ్యానం ద్వారా అత్యధిక ఏకాగ్రత, సృజనాత్మకత శక్తి పొందవచ్చని దీని వల్ల పరీక్షల్లో ఒత్తిడి తగ్గి ప్రశాంతంగా పరీక్షలు రాయవచ్చని అన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కేవీవీ సత్యనారాయణ, వ్యాయామోపాధ్యాయురాలు జి.సత్యవేణి, మాతాజీ నిర్మలాదేవి, సహజ రాజయోగ సాధన గురువులు, శిక్షకులు పాల్గొన్నారు.

16న దేశవ్యాప్త బంద్

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 13: కేంద్రంలో మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న సామ్రాజ్యవాద, కార్పొరేట్ల అనుకూల విధానాలకు నిరసనగా రైతు సంఘాలు, కేంద్ర కార్మిక సంఘాల జేఏసీ ఇచ్చిన పిలుపుతో దేశవ్యాప్తంగా ఈనెల 16న నిర్వహిస్తున్న బంద్‌ను విజయవంతం చేద్దామని ఐఎఫ్‌టీయూ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు ఏవీ రమణ పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు.

రాజశ్యామల యాగం

గోకవరం, ఫిబ్రవరి 13: లోక కల్యాణార్థం రాజ శ్యామల యాగాన్ని మంగళవారం గోకవరంలో వైభవంగా జరిపారు. చుట్టు ప్రక్క ప్రాంతాల ప్రజలు, భక్తులు అధిక సంఖ్యలో ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. తంటికొండ రోడ్‌లో ఉన్న సీఎండీ కేఎస్‌పీపీ ఫిన్స్ లే అవుట్ ప్రాంగణంలో విశ్వ హిందూ ధర్మ పరిరక్షణ రామసేన వ్యవస్థాపక అధ్యక్షుడు కంబాల శ్రీనివాసరావు దంపతుల ఆధ్వర్యంలో కార్యక్రమం సాగింది.

రంగంపేట భవిత కేంద్రం పరిశీలన

రంగంపేట, ఫిబ్రవరి 13: భవిత కేంద్రాల్లో ప్రత్యేక అవసరాల విద్యార్థులు ట్యాబ్‌లను వినియోగించుకొని, శాస్త్ర, సాంకేతిక విద్యాభ్యాసం చేయడం బాగుందని జిల్లా సమగ్ర శిక్షా అకౌంట్స్ ఆఫీసర్, ఐఈ కోఆర్డినేటర్ జె.స్నేహలత అన్నారు. మంగళవారం రంగంపేట భవిత కేంద్రాన్ని ఆమె పరిశీలించి మాట్లాడారు. విద్యార్థుల ట్యాబ్స్ బోధనా పరికరాలు వినియోగంలో ఉపాధ్యాయులు కృషిని ఆమె అభినందించారు. జిల్లాలో 19 భవిత కేంద్రాలున్నాయని, వాటిలో విద్యార్థులకు అవసరమైన ట్యాబ్‌లను, బోధనోపకరణాలను, వినికిడి యంత్రాలను, కృత్రిమ అవయవాలను సమకూర్చామన్నారు. వారానికి ఒక రోజు ఫిజియోథెరపీ ద్వారా శారీరక ఆరోగ్యంపై విద్యార్థులకు, తల్లిదండ్రులకు ప్రయోగాత్మక శిక్షణ ఇస్తున్నామన్నారు. రంగంపేట భవిత కేంద్రం నిర్వహణలో ఐఈఆర్టీ కోఆర్డినేటర్లు ఎంవీ ఎస్.ప్రసాద్, జి.అంజలి కృషిని ఆమె ప్రశంసించారు.

సినిమా గైడ్

కొవ్వూరు	
యువరాజీమాల్ వై.స్ర్కీన్1	కిస్మత్, బూట్‌కట్ బాలరాజు
వై.స్ర్కీన్2	గేమ్ ఆన్
దేవిశ్రీ(గాయత్రి)	హనుమాన్
అనన్య	అంబాజీపేట బ్యారేజీ బ్యాండ్
నిడదవోలు	
వీ మ్యాక్స్	లాల్ సలామ్
రాధాకృష్ణ	హనుమాన్
శ్రీగణపతి	ఈగల్
దేవరపల్లి	
శ్రీరామ్ సినీ మ్యాక్స్	గుంటూరు కారం
శ్రీరామ్ సినీ మ్యాక్స్	గుంటూరు కారం
నల్లజర్ల	
శ్రీలక్ష్మి మల్టీప్లెక్స్	సలార్
శ్రీనివాస	సలార్